RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 160 ISSUE NO : 160 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం,డిసెంబర్,16,2025 Tuesday,December,16,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## గాయకుడు బాలు అందరివాడు

**మన తెలుగవాడు కావడం గర్వకారణం**
**స్వరసరస్వతిని స్మరించుకోవడం అదృష్టం**
**బాలు విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు**

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకమని, బాలును అభిమానింగా గౌరవించుకోవడం తెలుగువారిగా మన కంతా గర్వకారణమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతి లో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాల సుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు.



## తిరిగి వస్తా...

### భారత అభిమానులకు మెస్సీ హామీ

- ఢిల్లీలో ఘనంగా ముగిసిన మెస్సీ భారత పర్యటన
- అరుణ్ జైట్లీ స్టేడియంను ముంచెత్తిన అభిమానులు
- భారత అభిమానుల ప్రేమకు మెస్సీ భావోద్వేగం
- తప్పకుండా మళ్లీ వస్తానని అభిమానులకు హామీ
- క్రికెట్ పెద్దలతో భేటీ..

### టీ20 వరల్డ్ కప్ టికెట్ అందుకున్న మెస్సీ

ఢిల్లీ: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటన ఘనంగా ముగిసింది. తన 'గోట్ ఇండియా టూర్'లో భాగంగా సోమవారం మెస్సీ చివరిగా ఢిల్లీలో సందడి చేశాడు. రాజధానిలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఫుట్‌బాల్ అభిమానులతో కిక్కిరిసిపోయింది. అర్జెంటీనా జెర్సీలు, మెస్సీ ఫొటోలతో స్టేడియం మొత్తం నీలి సముద్రాన్ని తలపించింది. అభిమానుల కేరింతల మధ్య మెస్సీ తన పర్యటనకు మధురమైన ముగింపు పలికాడు. వాతావరణం అనుకూలించకపోవడంతో సోమవారం మధ్యాహ్నం నాటికి మెస్సీ ఢిల్లీకి చేరుకున్నాడు. లీలా ప్యాలెస్ హోటల్‌లో బస చేసిన అనంతరం నేరుగా అరుణ్ జైట్లీ స్టేడియానికి బయలుదేరాడు. అప్పటికే వేలాది మంది అభిమానులు తమ ఆరాధ్య ఆటగాడి కోసం ఎదురుచూస్తున్నారు. సెలబ్రిటీ మెస్సీ ఆల్ స్టార్స్, మినర్వా మెస్సీ ఆల్ స్టార్స్ మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగినా, అందరి దృష్టి మెస్సీ కోసమే నిరీక్షించింది. ఈ మ్యాచ్‌లో మినర్వా అకాడమీ యువ ఆటగాళ్లు 6–0 తేడాతో సెలబ్రిటీ జట్టుపై ఘన విజయం సాధించారు.



## గ్రామాల్లో బీఆర్ఎస్ హవా

- ఈ నెల 19న తెలంగాణ భవన్‌కు కేసీఆర్
- ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గ సభ్యులతో భేటీ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 19వ తేదీన తెలంగాణ భవన్‌కు రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం నిర్వహించ నున్నారు. ఈ సమావేశం సందర్భంగా కృష్ణా, గోదావరి జలాల విషయంలో, తెలంగాణ రాష్ట్రానికి, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి మీద చర్చించనున్నారు.

- బిఆర్ఎస్ రెండోవిడతలోనూ అద్భుత ఫలితం
- కాంగ్రెస్ మోసాలతో ప్రజలు విసుగెత్తారు
- రేవంత్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టం
- పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపిన కెటిఆర్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టకాలంలో బీఆర్ ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుందన్నారు.



## పంచాయితీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం

## జీహెచ్ఎంసీలో వార్డుల పునర్విభజన




- భారీగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేతలు
- ప్రధానంగా ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యేల అభ్యంతరం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనపై భారీగా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల శివారు ప్రాంతాలను విలీనం చేయడంతో 300 వార్డులు ఏర్పాడ్డాయి. అయితే దీనిపై అభ్యంతరాల స్వీకరణ సోమవారంతో పూర్తి అయ్యింది. ఈ క్రమంలో మంగళవారం బల్దియా ప్రత్యేక కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ కౌన్సిల్‌లో కార్పొరేటర్ల అభిప్రాయాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తీసుకోనున్నారు. తద్వారా వార్డలు పనుర్విభజన ఏమైనా ఉంటే చేస్తారు. ఇప్పటి వరకు 1,328 అభ్యంతరాలు వచ్చాయి. ఆదివారం ఒక్కరోజే 227 అభ్యంతరాలు స్వీకరించారు అధికారులు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ ఆఫీసుల్లో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు జీహెచ్ఎంసీ అధికారులు. 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే వార్డుల విభజనపై అభ్యంతరాలు తెలపడానికి జీహెచ్ఎంసీకి క్యూ కట్టారు నగర ఎమ్మెల్యేలు.



## కాలుష్య కాసారంగా.. రామగుండం

**అదిలాబాద్,తెలంగాణ దిశ :** రామగుండం– జైపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాంతం ఇప్పుడు రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకర ప్రాంతంగా మారింది. వాయు, జల కాలుష్యంగా పతాక స్థాయికి చేరడంతో ప్రజారోగ్య పరిరక్షణ ప్రమాదంలో పడింది. ఈ ప్రాం తంలో సుమారు 15 లక్షల జనాభా ఉండగా, సుమారు 6 వేల మంది క్యాన్సర్ బారిన పడ్డారు. వేలాది మందికి ప్రీ క్యాన్సర్ లక్షణాలు బయటపడ్డాయి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారీతిన బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు, సిమెం ట్ ఫ్యాక్టరీలకు అనుమతులు ఇస్తుండటం తో కాలుష్యం రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ ప్రాంతంలోని 5,400 మెగా వాట్ల థర్మల్ పవర్ ప్లాంట్లలో యాజమాన్యాలు ఏటా దాదాపు 50 లక్షల టన్నుల బొగ్గు మండిస్తున్నాయి. అలాగే సిమెంట్ తయారీ కోసం ఆ కంపెనీ 95 లక్షల టన్నుల బొగ్గును మండిస్తున్నది. ఇవి కాక త్వరలో రామగుండం ప్రాంతంలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లు ఏర్పా టు చేయాలనే ప్రణాళికలు ఉన్నాయి.అదేజరిగితే ఈ ప్రాంతంలో వాయు, జల కాలుష్యం అత్యంత ప్రమాదకరస్థాయికి పెరుగనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాల ప్రకారం 5 మైక్రోగ్రా మ్ పర్ క్యూబిక్ మీటర్‌లో పీఎం 2.5 కాలుష్య రేణువులు ఉండటం ప్రమాదక రం కాదు. కానీ, నవంబర్ నెలలో రామగుండం పరిసర ప్రాంతాల్లో ఆ సూచిక 175– 250 మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్ నమోదైంది. అంటే సురక్షిత పరిమితికి కంటే..

## బండి వర్సెస్ ఈటెల



**కరీంనగర్,తెలంగాణ దిశ :** కేంద్ర మంత్రి బండిసంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్. ఇది కొత్త ఎపిసోడేం కాదు. తెలంగాణ స్థానిక ఎన్నికలు రాబోతున్నాయన్న ప్రచారం స్టార్ట్ అయినప్పటి నుంచే ఇద్దరు నేతల మధ్య కోల్డ్ వార్ రచ్చకెక్కింది. నువ్వానేనా అన్నట్లుగా ఒకరిపై మరొకరు ఇండైరెక్ట్ కామెంట్స్‌తో హీటెక్కించారు. తన పార్లమెంట్ పరిధిలో తన అనుచరులే అభ్యర్థులుగా ఉంటారని సంజయ్..హుజురాబాద్ తన ఇలాకా..అక్కడ తన అనుచరులే బరిలో ఉంటారు..గెలిపించుకుని తీరుతానంటూ ఈటల హాట్ కామెంట్స్ చేసి చర్చకు తెరలేపారు.ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసింది. ఇలా ఫస్ట్ ఫేజ్ ఎన్నికలు పూర్తయ్యాయో లేదో..మరోసారి వార్ ఆఫ్ వర్డ్స్ హీటెక్కిస్తున్నాయి. స్వయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆఫీస్ నుంచి రిలీజ్ అయిన ఒక ప్రెస్ నోట్‌తో.. పాత వివాదం కొత్త రచ్చకు దారితీసి నట్లు అయింది. హుజురాబాద్ ని యోజకవర్గం కమలాపూర్ మండ లంలో బోణీ కొట్టిన బీజేపీ..బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ర్యాకం శ్రీనివాస్ 90 ఓట్లతో విజయం అంటూ కేంద్రమంత్రి బండిసంజయ్ ఆఫీస్ ప్రెస్ నోట్ రిలీజ్ చేసింది.

# డివిజన్ల విభజనలో లోపించిన శాస్త్రీయత


## - బిజెపి శేరిలింగంపల్లి ఇంచార్జీ రవికుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ)** :గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 300 డివిజన్లను ఏ ప్రాతిపదికన విభజించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని బిజెపి శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ మారబోయిన రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. జనాభా ప్రాతి పదికన విభజించారా..! లేక ఓటర్ల జాబితా ప్రకారం విభజించారా.. ఏ ప్రాతిపదికన విభజించారో ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతాలను జీహెచ్ఎంసీ పరిధిలోని తీసుకువస్తూ ఉన్న డివిజన్ల విభజన పేరుతో ఇష్టారాజ్యంగా సరిహద్దులను ప్రకటిస్తూ ఇచ్చిన జీవో పై అభ్యంతరాలను తెలుపుతూ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర?డే హేమంత్ సాహదేవ్ రావుకు వినతి పత్రం సమర్పించారు. అదే విధంగా బీజేపీ తెలంగాణ డెలిమిటేషన్ మానిటరింగ్ కమిటీ కన్వీనర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కు మరో వివిధ పత్రాన్ని అందజేశారు. డివిజన్ల విభజన ప్రక్రియ సరిగా చేపట్టలేదని, సరిగా సరిహద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా డివిజన్ల విభజించడం సరైన పద్ధతి కాదన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ విభజనలో దాదాపు 70 వేల ఓటర్లు ఉన్నారని, మసీద్ బండ డివిజన్ 12 పోలింగ్ బూతులకే పరిమితమైందన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఆరంభ టౌన్ షిప్, సందయ్య నగర్, సురభి కాలనీ నుండి గోపి చెరువు నాలా మీదుగా చాకలి చెరువు నాలా మీదుగా అరబిందో గ్రేటర్ కమ్యూనిటీలను మసీద్ బండ డివిజన్ లో కలపాలని ఆయన కోరారు. అదే విధంగా బికె ఎన్ క్లేవ్ డివిజన్ ను మక్త గ్రామస్థుల కోరిక మేరకు మక్త మహబూబ్ పేట్ డివిజన్ గా మార్చాలని కోరామన్నారు. అలాగే మాతృ శ్రీ నగర్ డివిజన్ సరిహద్దుల ఏర్పాటు కూడా గందరగోళంగా ఉందన్నారు. గూగుల్ మ్యాప్ తో డివిజన్లను విభజించిన ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. విభజన ప్రతిపాదన పెట్టినప్పుడు కనీసం ప్రజల నుంచి, రాజకీయ పార్టీల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలనే సోయి కూడా లేకుండా పోయిందన్నారు. మీరు ఇచ్చిన సరిహద్దులలో ఏ కాలనీ, ఏ బస్తీ, ఏ డివిజన్ పరిధిలోకి వెళుతుందో కనీసం ప్రభుత్వానికైనా తెలుసా అని ప్రశ్నించారు. ఇదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తే రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక జరిగినా మీ పార్టీనీ, మీ ప్రభుత్వాన్ని ప్రక్కకు కూర్చోబెడతారన్నారు.

తెలంగాణ ప్రజలు చాలా చైతన్యవంతులన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతిఒక్కటి గుర్తు పెట్టుకుని అన్నింటికీ ఒక రోజు సమాధానం చెబుతారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, బుచ్చి రెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, సీనియర్ నాయకులు వసంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాప్రాలో ఎన్ని కమ్యూనిటీ హాళ్లు అద్దెకిచ్చుకుంటున్నారో వివరాలు ఇవ్వండి



**కాప్రా,డిసెంబర్ 15, (తెలంగాణ దిశ)** :కాప్రా సర్కిల్ పరిధిలో ప్రభుత్వం నిర్మించిన ఎన్ని కమ్యూనిటీ హాల్ లను అద్దెకిస్తున్నారో వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ కు సమాచార హక్కు చట్టం కింద వినతిపత్రం సమర్పించారు. కాప్రా సర్కిల్ పరిధిలోని జిహెచ్ఎంసి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ నిర్వహణ ఏఏ కాలనీలలో ఎవరెవరు చేస్తున్నారని ప్రశ్నించారు. కాలనీ అసోసియేషన్ వారు ఏఏ కాలనీలలో కమ్యూనిటీ హాల్స్ ఎంత మొత్తంలో అద్దెకు ఇచ్చుకుంటున్నారో వివరించాలని కోరారు. జిహెచ్ఎంసి అధికారులు గత నెలలో దాదాపు 80 కమ్యూనిటీ హాల్స్ కు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో పై వివరాలను ఇవ్వాలని కోరారు. అదే విధంగాజిహెచ్ఎంసి ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలో జిహెచ్ఎంసి ద్వారా 2021 మార్చి ఒకటి నుంచి 15 డిసెంబర్ 2025 వరకు అభివృద్ధి నిర్మాణ పనులకు మంజూరైన మొత్తం నిధులు అన్ని.. వాటి ద్వారా ఏ ఏ పనులు చేపట్టారో వివరించాలని కోరారు.

# కన్నుల పండువగా రాయారావు ఫౌండేషన్ ఆత్మీయ సమావేశం



**నర్సాపూర్, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ) :** ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు, కుటుంబ వ్యవస్థ కనుమరుగవుతున్న ఈ నాటి తరుణంలో మూడు తరాలకు చెందిన కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిన్నారం మండలం నల్లవల్లి గ్రామంలో జరిగింది. రాయారావు ఫౌండేషన్ వారు నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాయారావు వంశానికి చెందిన దాదాపు రెండు వందల మంది హాజరయ్యారు. రాయారావు కుటుంబ సంబంధీకుడు ఆర్ఎస్ కె. భూపాల రావు అధ్యక్షత వహించిన ఈ ఆత్మీయ సమావేశానికి స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి విశిష్ట అతిథులు సీనియర్ ఎడిటర్ కె. రామచంద్ర మూర్తి, కేంద్ర మాజీ సమాచార కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ పాల్గొన్నారు. రాయారావు జానకి రామారావ్, లక్ష్మీదేవి దంపతులు ఆతిథ్యంలో జరిగిన ఈ ఒక పండుగలా సాగిన ఈ సమావేశం తొలుత స్థానిక కళాకారుల బృంద గానంతో ప్రారంభమైంది. ముఖ్య అతిథి డాక్టర్ శివనాగిరెడ్డి నల్లవల్లి గ్రామం ప్రాశస్త్యాన్ని గురించి చెప్తూ గ్రామానికి ఉన్న చారిత్రక ప్రాముఖ్యతను, గ్రామంలో ఉన్న పురాతన సంతాన వేణుగోపాల స్వామి ఆలయం గురించి, ఆలయం పరిసరాల్లో పడి ఉన్న విగ్రహాలు రాష్ట్రకూటుల కాలం నాటివని వివరించారు. సీనియర్ ఎడిటర్ రామచంద్ర మూర్తి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ప్రతి యేటా ఇటువంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నందుకు రాయారావు వంశస్థులను అభినందించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ సామాజిక, సాహిత్య పాలనా రంగాలలో తెలంగాణ రాయారావుల ఖ్యాతిని కొనియాడారు. 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్' ప్రార్థనా గీతంతో మొదలైన ఈ సమావేశంలో రాయారావు వంశంలో మొట్టమొదటి జర్నలిస్ట్, అభ్యుదయ రచయిత ఆర్వీ రామారావ్ ఆంధ్రభూమి, ఆంధ్ర ప్రభ పత్రికలలో రాసిన 'ఆదివారం సంపాదకీయాల' తో వెలువరించిన 'విశేష' పుస్తకాన్ని ఆవిష్కరించారు. బంధుమిత్రులు రాయారావు వంశస్థులతో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రాయారావు కుటుంబానికి మనవడు మడుపు ప్రభాకర రావు దంపతులు ఈ కార్యక్రమం కోసం కెనడా నుంచి రాయారావు వంశంలో అందరి కన్నా సీనియర్లు రాయారావు జానకి రామారావ్, లక్ష్మీదేవి దంపతులను బంధు మిత్రులు నూతన వస్త్రాలతో సత్కరించారు. 2012 నుంచి జరుగుతున్న ఈ ఆత్మీయ సమావేశాలకు గతంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి, మన తెలంగాణ పత్రిక ఎడిటర్ దేవులపల్లి అమర్ తదితరులు హాజరయ్యారు. మధ్యలో విశ్వ మహమ్మారి తదితర కారణాల వల్ల ఆరేళ్ల అంతరాయం తరువాత సమ్మేళనం ఈ ఏడాది మళ్లీ మొదలైంది.

# మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ కాలనీ స్థల వివాదాన్ని పరిష్కరించాలి...

## - జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజుల రామారం మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ కాలనీ స్థల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. సర్వే నెంబర్ 329/2, 329/10 లోని 130 ఎకరాల పట్టా భూమి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో అంటే 2016వ సంవత్సరం నుండి ప్రభుత్వ భూమిగా పేర్కొన్నారని వివరించారు. ఈ భూమిలో 1975 లో శాలివాహన బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మహాదేవపురం కాలనీ లే అవుట్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటి గ్రామ పంచాయతీ తీర్మానంలో ఈ లే అవుట్ ఆమోదం పొదిందన్నారు. అదే విధంగా అప్పటి రెవిన్యూ అధికారులు 1967 సంవత్సరం నుండి అందజేసిన పహానీలు, రెవిన్యూ సంబంధిత పత్రాలతో హైకోర్టును సంప్రదించగా మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ కాలనీ యజమానులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. దీంతో రిజిస్ట్రేషన్, పర్మిషన్లకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ జారీ చేశారన్నారు. కానీ ప్రతి ప్లాట్ యజమాని వారి యొక్క అవసరం నిమిత్తం ప్లాట్ క్రయ విక్రయాల కోసం అలాగే ఇంటి అనుమతుల కోసం న్యాయస్థానాన్ని సంప్రదించడం ఎన్నో. వ్యయ ప్రయాసాలతో పాటు అధిక సమయం పట్టడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. ఈ సమస్యలను సోమవారం తొలుత మహాదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ను కలిసి వివరించారు. ఇందుకు స్పందించిన కూన శ్రీశైలం గౌడ్ మహాదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి వెళ్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో పర్యవేక్షించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, ప్రసాద్ దుగ్గాల, రామచంద్రారెడ్డి, రంగారావు, జగదీశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, ప్లాట్ యజమానులు మరియు కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గెలిపించండి..., ఎల్లవేళలా అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా

## - వెంకటాపురం సర్పంచ్ అభ్యర్థి విజయ కుమారి





ములుగు, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ) : ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం విస్తృతంగా సాగుతుంది. బిఆర్ఎస్, తెలుగుదేశం పార్టీలు బలపరిచిన బి. విజయ్ కుమారిని గెలిపించేందుకు పొత్తులు కుదుర్చుకున్నాయి. అంతే కాకుండా రెండు పార్టీల కార్యకర్తలు ఆమెను గెలిపించేందుకు విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెను గెలిపించేందుకు ఇంటింటా ప్రచారంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. బాలు గుర్తుకు చేయాలంటూ వీధివీధినా నినాదాలు చేస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. వెంకటాపురం మండలం బి ఆర్ఎస్ నేతలు గొడవర్తి నరసింహమూర్తి జాగర శివాజీ, శాంతి మూర్తి, తెలుగుదేశం పార్టీ తరఫునుంచి ఆత్మకూరి పట్టాభి, నేతృత్వంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటర్లను ఆకర్షించే విధంగా వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా విజయ కుమారి మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు ఎల్లవేళలా దగ్గర ఉంటానని అన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుంటానని చెప్పారు. ప్రతి వీధికి సరైన రోడ్డు సౌకర్యం, వీధిలైట్లు, మంచినీటి సౌకర్యం ఉండే విధంగా తమ కృషి ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో ఎంపీపీగా ఉన్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలకుండా చూశానని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందేలా తాను చేసిన కృషి ప్రజలు ఎప్పటికి మర్చిపోరని అన్నారు. సర్పంచ్ గా గెలిపిస్తే నా బాధ్యతలు నేను మనస్ఫూర్తిగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. బాలు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వెంకటాపురం మండలంలోని ఎక్కడ చూసిన బి ఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ప్రతి ఒక్కరికి నుంచి వినబడుతుందన్నారు. విజయ కుమారి భర్త ముడుంబా శ్రీనివాస్ మండలంలోని ఎవరికి ఏ సమస్య వచ్చినా సదరు వ్యక్తి ఏ పార్టీ అయినా గాని సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని స్థానికులు పేర్కొన్నారు.

# లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ)** :జిల్లాలోని ప్రైవేట్ వైద్య సంస్థల్లో లింగ నిర్ధారణను నిషేధించే (పిసిపిఎన్ డిటి) గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ నిబంధనల అమలు, రిజిస్ట్రేషన్, రెన్యూవల్ ప్రక్రియ అంశాలపై ఇటీవల నిర్వహించిన పరిశీలనల నివేదికలతోపాటు చర్యలపై సమగ్రంగా చర్చించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో జిల్లాలో స్కాన్ లు నిర్వహిస్తున్న ప్రతి ప్రైవేట్ వైద్య సంస్థ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ పూర్తి చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ కానీ పిఎన్ డిటి యాక్ట్ ఉల్లంఘనలు చేసిన వారిపై, సంస్థలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నిబంధనలపై సమగ్ర సూచనలు, రికార్డుల నిర్వహణ, ప్రమాణాలు, పరికరాలు, మానవ వనరులు, రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలు వంటి అంశాలపై వైద్య సంస్థలకు ఇవ్వాల్సిన సూచనలు కమిటీ ద్వారా నిర్ణయించారు. సమావేశంలో నూతన రెన్యూవల్ అప్లికేషన్లను కమిటీ పరిశీలించి, ఆమోదించింది. తదుపరి ఆదేశాల కోసం జిల్లా కలెక్టర్ కు పంపించారు. ఈ సమావేశంలో పిసిపిఎన్ డిటి, సరోగసి, ఎన్ టిపి మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ అంశాలపై సమగ్రంగా చర్చించడంతో పాటు తీసుకోవలసిన చర్యల గురించి కమిటీ సూచించింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, కమిటీ కన్వీనర్ డాక్టర్ ఉమాగౌరి, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ గీత, డాక్టర్ పవన్,వసంత రెడ్డి, డిప్యూటీ డెమో సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి




**(మేడ్చల్ జిల్లా ప్రతినిధి, తెలంగాణ దిశ)** జిల్లాలో దివ్యంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ పిఆర్ డి రాష్ట్ర అధ్యక్షుడు కురునెల్లి వెంకట్ కోరారు.సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారిని శారద ఆధ్వర్యంలో జిల్లా వివిధ శాఖల అధికారులతో సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్ పిఆర్ డి జిల్లా కార్యదర్శి కె. నాగలక్ష్మి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

## - కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ)** :ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ మల్లంపేట్ కు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు హరివర్ధన్ స్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి స్వామి తదితరులు 41 రోజులు అయ్యప్ప స్వామి దీక్ష పూర్తి చేసుకొని శబరిమల సన్నిధానానికి వెళ్తున్నా సందర్భంగా ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి స్వాములకు శుభాకాంక్షలు తెలిపారు. దీక్ష విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ శరీర, మనసు, ఆత్మ నియంత్రణతో కూడిన అయ్యప్ప దీక్ష ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి బోధించిన శరణాగతి, సమానత్వం, క్రమశిక్షణ వంటి విలువలు నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. కఠిన నియమాలు పాటిస్తూ దీక్షలో ఉన్న స్వాములు సమాజంలో మంచి మార్పుకు దారి చూపుతున్నారని ప్రశంసించారు.

మతం, కులం అనే భేదాలు లేకుండా అందరూ ఒక్కరూ అయ్యప్ప స్వామిని ఆరాధించడం భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయానికి నిదర్శనమని తెలిపారు. ప్రత్యేకంగా యువత అయ్యప్ప దీక్ష ద్వారా క్రమశిక్షణ, సేవాభావం, సహనం నేర్చుకోవాలని సూచించారు. సమాజంలో శాంతి, ఐక్యత పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి (గోపాల్) పద్మారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శామీర్ పెట్ ప్రకాష్ రావు, గురువారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాజ్యాంగంలో భారతీయతపై చర్చ

భారత రాజ్యాంగం, జాతీయ జెండా, కులవ్యవస్థపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అభిప్రాయాలపై ఎప్పుడూ విమర్శలు వినిపిస్తూనే ఉంటాయి. ఈ మూడు ప్రధాన అంశాలపై స్వాతంత్ర్యం నుంచి ఇప్పటిదాకా అనేక సందర్భాల్లో ఆర్ఎస్ఎస్ చాలాసార్లు తన అభిప్రాయాలు మార్చుకుంది."అనేక పశ్చిమ దేశాల రాజ్యాంగాల నుంచి అనేక విషయాలు తీసుకుని వైవిధ్యభరితంగా మన రాజ్యాంగం రూపొందించారు. దాంట్లో మన సొంతం అని పిలవడానికి ఏదీ లేదు. మన జాతీయ లక్ష్యానికి సంబంధించి, మన జీవితాల్లోని ప్రాధాన్యాలకు సంబంధించి ఒక్క పదమన్నా అదులో ఉందా? లేదు.." అని 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో సంఘ్ రెండో అధ్యక్షుడు మాధవ్ సదాశివరావ్ గోల్‌వాల్కర్ రాశారు"రేపు అధికారం చేపట్టబోతున్నవాళ్లు మన చేతుల్లో త్రివర్ణజెండా ఉంచుతారు. కానీ దాన్ని హిందువులు ఎప్పుడూ గౌరవించరు, తమ సొంతంగా భావించరు. మూడు అనే పదం మంచిది కాదు. మూడు రంగులతో ఉండే జెండా మానసికంగా చాలా తీవ్రమైన చెడు ప్రభావం చూపుతుంది. దేశానికి ప్రమాదకరమైనది" అని భారత్‌కు స్వాతంత్ర్యం రావడానికి ఒకరోజు ముందు 1947 ఆగస్టు 14న తన పత్రిక ఆర్గనైజర్‌లో ఆర్ఎస్ఎస్ రాసిన వ్యాఖ్యలను చాలామంది విమర్శిస్తుంటారు. ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించిందని ప్రముఖ లాయర్, రాజకీయ వ్యాఖ్యాత ఏజీ నురానీ 'ది ఆర్ఎస్ఎస్: దేశానికి ప్రమాదం' అనే తన పుస్తకంలో రాశారు. ఏజీ నురానీ బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పనిచేశారు."రాజ్యాంగాన్ని హిందూ వ్యతిరేకమైనదిగా పేర్కొంటూ, దేశంలో తాము ఎలాంటి రాజకీయం కోరుకుంటున్నామో తెలియజేస్తూ 1993 జనవరి 1న సంఘ్ శ్వేతపత్రం ప్రచురించింది. భారత్ సమగ్రతను, సోదరభావాన్ని, మతపరమైన సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీసింది ఎవరు? ఆకలి చావులకు, నిరుద్యోగితకు, అవినీతికి, మతపరమైన అసహనానికి కారణం ఎవరు? దీనికి సమాధానం 'భారత ప్రస్తుత రాజ్యాంగం' అనే శ్వేతపత్రంలో ఉంది" అని నురానీ రాశారు. 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన కొన్ని రోజుల తర్వాత ఈ శ్వేతపత్రం ప్రచురితమైంది."ప్రస్తుత రాజ్యాంగం దేశ సంస్కృతి, స్వభావం, పరిస్థితులు మొదలైన వాటికి విరుద్ధంగా ఉంది. దీనిపై ఇతర దేశాల ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు చేసిన తర్వాతే మన ఆర్థిక విధానం, న్యాయ, పరిపాలనా నిర్మాణం, ఇతర జాతీయ సంస్థల గురించి మనం కొత్తగా ఆలోచించాల్సి ఉంటుంది" అని శ్వేతపత్రం పీఠికలో స్వామి హిరానంద్ రాసినట్టు నురానీ చెప్పారు. రాజ్యాంగంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో ఈ దేశం నీతి, ప్రతిభకు అనుగుణంగా రాజ్యాంగాన్ని స్వీకరించాలని 1993 జనవరిలో అప్పటి ఆర్ఎస్ఎస్ చీఫ్ రాజేంద్ర సింగ్ రాశారని తన పుస్తకంలో నురానీ పేర్కొన్నారు. 1993 జనవరి 24న అప్పటి బీజేపీ అధ్యక్షుడు మురళీ మనోహర్ జోషి కూడా రాజ్యాంగాన్ని కొత్తగా పరిశీలించాలనే డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో పునరుద్ఘాటించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, కొంతమంది బీజేపీ నేతలు 'అబ్‌కిబార్ 400 పార్' (ఈసారి మేము 400 దాటతాం)అన్న నినాదం నిజమైతే...అది రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రకటనలు చేయడం ప్రారంభించారు. అలా చేయాలనే ఉద్దేశం లేదని బీజేపీ చాలాసార్లు స్పష్టం చేసినప్పటికీ, రాజ్యాంగంలో భారీగా ప్రాథమిక మార్పులు చేయడానికి పార్టీ ప్రయత్నించిన ఉదాహరణలు ఉన్నాయిఅటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, వారు చేసిన మొదటి పని రాజ్యాంగాన్ని సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం. చాలా గందరగోళం చెలరేగిన తర్వాత వారు కమిటీ ఏర్పాటుకు గల కారణాన్ని మార్చారు. రాజ్యాంగాన్ని పూర్తిగా సమీక్షించడానికి బదులుగా, ఇప్పటివరకు రాజ్యాంగం ఎలా పనిచేసిందో కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు" అని నీలాంజన్ ముఖోపాధ్యాయ్ తెలిపారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో రాజ్యాంగాన్ని సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశారని, ప్రస్తుత రాజ్యాంగం స్థానంలో కొత్త రాజ్యాంగం ఉండాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ భావించాయని ముఖోపాధ్యాయ్ తెలిపారు. నరేంద్ర మోదీ మాత్రం 2014లో ప్రధాని అయిన వెంటనే రాజ్యాంగం భారతదేశంలోని ఏకైక పవిత్ర గ్రంథం అని, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయం అని పిలవడం ప్రారంభించారు"ఈ రాజ్యాంగాన్ని మన ప్రజలు తయారుచేశారు. రాజ్యాంగం మన దేశ ఏకాభిప్రాయం. కాబట్టి రాజ్యాంగాన్ని క్రమశిక్షణగా అనుసరించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. ఆర్ఎస్ఎస్ ఇప్పటికే దీన్ని విశ్వసిస్తోంది. స్వతంత్ర భారతదేశం అన్ని చిహ్నాలను, రాజ్యాంగ స్ఫూర్తిని మేము పూర్తిగా గౌరవిస్తూనే ఉన్నాం" అని ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ 2018లో దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మాట్లాడుతూ అన్నారు. బద్రీ నారాయణ్ ఒక సామాజిక చరిత్రకారుడు, సాంస్కృతిక శాస్త్రవేత్త. ఆయన ప్రస్తుతం అలహాబాద్‌లోని గోవింద్ వల్లభ్ పంత్ సోషల్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు."రాజ్యాంగాన్ని పూర్తిగా గౌరవిస్తున్నామని, రాజ్యాంగంతో ఉన్నామని, రాజ్యాంగ విలువలను విశ్వసిస్తున్నామని కొన్నేళ్లగా ఆర్ఎస్ఎస్ స్పష్టం చేస్తోంది. వివాదాలు సృష్టించాలనుకునేవారు ఏ విషయాన్నయినా లేవనెత్తవచ్చు. అన్నింటిలో రాజకీయాలు చూడొచ్చు. మోహన్ భగవత్ లేదా ఆయన కంటే ముందు బాలాసాహెబ్ డియోరాస్ చేసిన ఆర్ఎస్ఎస్ ప్రకటనలను మీరు గమనిస్తే, ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విశ్వసిస్తోందని స్పష్టంగా తెలుస్తుంది" అని నారాయణ్ అన్నారు. ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగంతో లోతైన అనుబంధం ఉందని, రాజ్యాంగానికి సంబంధించి గత రెండు దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ వైఖరి రాజ్యాంగానికి అనుకూలంగా ఉందని, అందులో ఎలాంటి వైరుధ్యం లేదని ప్రొఫెసర్ బద్రీ నారాయణ్ చెప్పారు. భారత పార్లమెంటు రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు అయిన సందర్భంగా డిసెంబర్ 2024లో జరిగిన వేడుకలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ రాజ్యాంగం, మనుస్మృతి అంశంపై హిందుత్వ సిద్ధాంతకర్త వి.డి.సావర్కర్ రచనలను ఉదహరించడం ద్వారా బీజేపీని లక్ష్యంగా చేసుకున్నారు. తన కుడి చేతిలో రాజ్యాంగం, ఎడమ చేతిలో మనుస్మృతి కాపీని పట్టుకుని రాహుల్ గాంధీ మాట్లాడారు. మన రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని సావర్కర్ తన రచనలలో స్పష్టంగా పేర్కొన్నారని రాహుల్ గాంధీ చెప్పారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది. నాలుగు రోజుల తర్వాత, సంఘ్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు రాసిన ఓ సంపాదకీయంలో రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని రాసి ఉంది" అని దిల్లీ విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రం బోధించిన, ఆర్ఎస్ఎస్, హిందూ జాతీయవాదం అనే విషయాలపై అనేక పుస్తకాలు రాసిన ప్రొఫెసర్ షంసుల్ ఇస్లాం చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంపై, దానిని మార్చలేమని 1973లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై చర్చను ప్రారంభించిందని ముఖోపాధ్యాయ్ చెప్పారు.'రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణం అనేదేమీ లేదని, ప్రతిదీ మార్చవచ్చని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కడ్, న్యాయశాఖ మాజీ మంత్రి కిరణ్ రిజిజు అందుకే వాదిస్తున్నారు. చట్టసభ అత్యున్నతమని వారు చెబుతున్నారు....అంటే రాజ్యాంగంలో ఏదైనా మార్చడానికి మీకు పార్లమెంటులో మెజారిటీ ఉంటే చాలు" అని ముఖోపాధ్యాయ్ చెప్పారు"ఆ సమయంలో జాతీయ స్వాతంత్ర్య పోరాటానికి కాంగ్రెస్ ప్రధాన స్రవంతి వేదికగా ఉందన్నది నిజం. స్వాతంత్ర్య లక్ష్యం నుంచి ఆర్ఎస్ఎస్ కూడా ప్రేరణ పొందింది. కానీ కాంగ్రెస్‌తో పోలిస్తే ఆర్ఎస్ఎస్‌కు భిన్నమైన ఉనికి ఉంది.

# డివిజన్ల విభజనలో అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి

**- ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలి**

**- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఏసి) చైర్మన్ అరికెపూడి గాంధీ**





**శేరిలింగంపల్లి, డిసెంబర్ 15 (తెలంగాణ దిశ) :**జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన లో అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని అమలు చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఏసి) చైర్మన్ అరికెపూడి గాంధీ కోరారు. డివిజన్ల పునర్విభజనలో నెలకొన్న సమస్యలు, మార్పులు, చేర్పుల విషయంలో జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్ వి. కర్ణన్ లకు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, వి. జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్ రెడ్డిలతో పలువురు కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరికెపూడి గాంధీ మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం జిహెచ్ఎంసి 300 డివిజన్లను ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు. సుపరిపాలన, పరిపాలన సౌలభ్యం కోసం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కానీ కొన్ని డివిజన్ల పునర్విభజనలో నెలకొన్న పలు సమస్యలను, ఇబ్బందులను పరిగణలోకి తీసుకోని పరిష్కరించాలని కోరారు. ప్రజల నుండి వచ్చే వినతులను పరిగణలోకి తీసుకొని ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అందరికి ఆమోదయోగ్యమైన డివిజన్లను ఏర్పాటు చేయాలని, ప్రజల నుండి, కాలనీ వాసుల నుండి వచ్చే ప్రతి వినతులను పరిగణలోకి తీసుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించి డివిజన్ల రూపకల్పన చేయాలని గాంధీ కోరారు.

# కాప్రా డిసి జగన్ తీరుపై సర్వత్ర నిరసన..,

**- నియంతలా వ్యవహరిస్తున్న జగన్**

**- సర్కిల్ కార్యాలయంలో తీవ్ర ఉద్రిక్తత**

**-ఏసిపి, సిఐల జోక్యంతో దిగివచ్చిన డీసీ...**



**కాప్రా, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ) :**కాప్రా డిసి జగన్ పై సర్వత్ర నిరసన వ్యక్తమవుతుంది. ఆయన నియంతలా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజనలో భాగంగా సోమవారం ఆందోళనకారులతో సర్కిల్ కార్యాలయంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. డివిజన్ 16కు కుషాయిగూడ పేరు పెట్టాలని కోరుతూ కుషాయిగూడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా జమ్మిగడ్డ ను ప్రత్యేక డివిజన్ గా ఏర్పాటు చేయాలని కోరుతూ జమ్మిగడ్డ కాలనీల వాసులు మరొక ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ రెండు డిమాండ్ల సాధన కోసం సోమవారం దాదాపు 300 మంది సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉండడంతో డిసి చాంబర్ లోనే ఉన్నారు. కిందికి వచ్చి ఆందోళనకారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించాలని కోరడంతో ఆయన కిందికి రావడానికి నిరాకరించారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించిన అనంతరం వినతి పత్రం సమర్పించడానికి సిద్ధమయ్యారు. దీంతో ఇద్దరు, ముగ్గురు వచ్చి వినతిపత్రం సమర్పించాలని సూచించారు. ఇందుకు ఆందోళనకారులు ఏకీభవించలేదు. ఇరుకైన గదిలో ప్రజావాణి కార్యక్రమంలో నిర్వహిస్తున్న డీసీని గతంలోనే సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని పలువురు సూచించినప్పటికీ లాభం లేకుండా పోయింది. దీంతో సమస్యలు చెప్పుకునేందుకు వస్తున్న వందలాది మందికి ఇబ్బందిగా తయారైంది. దీంతో ఆందోళనకారులు డీసీ కిందికి వచ్చి



వినతిపత్రం స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఇందుకు డిసి నిరాకరించడంతో ఆందోళనకారులు డీసీకి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో సర్కిల్ కార్యాలయంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి, సిఐ భాస్కర్ రెడ్డి జోక్యం చేసుకొని డీసీని కిందికి పిలిపించారు. డిసి ఇరు వర్గాల వాదనలు విని, వినతి పత్రాలు స్వీకరించడంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ సందర్భంగా ఆందోళనకారులు డీసికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

# కాప్రాలో రచ్చ లేపిన జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన







**కాప్రా, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ) :** కాప్రాలో జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన రచ్చను సృష్టించింది. 16వ డివిజన్ చక్రిపురంకు కుషాయిగూడ పేరును పెట్టాలని ఆందోళన రోజు రోజుకు ఉద్రతమవుతుంది. అదేవిధంగా జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్ గా ప్రకటించాలని కోరుతూ ఆయా కాలనీల వాసులు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. పునర్విభజన అభ్యంతరాల స్వీకరణకు గడువు దగ్గర పడుతుండడంతో ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. సోమవారం కుషాయిగూడ నుంచి ఈసీఐఎల్ చౌరస్తా మీదుగా కాప్రా మున్సిపల్ ఆఫీస్ వరకు కుషాయిగూడ కాలనీల వాసులు ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు జమ్మిగడ్డ కాలనీవాసులు జమ్మిగడ్డ నుంచి కాప్రా సర్కిల్ కార్యాలయం వరకు మేళ తాళాలతో ప్రదర్శన నిర్వహించారు. సోమవారం ప్రజావాణి కావడంతో రెండు ర్యాలీలు కాప్రా సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఆందోళన కారుల నుంచి విజ్ఞాపన పత్రాలు తీసుకునేందుకు కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి రాకపోవడంతో ఆందోళన ఉధృతమైంది. డీసీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రావాలి..., డీసీ కిందికి రావాలి అనే నినాదాలతో సర్కిల్ కార్యాలయం మారు మోగింది. కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి జోక్యం చేసుకొని డిసిని కిందికి తీసుకువచ్చారు. దీంతో డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో డిసి జగన్ కు వినతిపత్రం సమర్పించారు. ఎంతో చరిత్ర ఉన్న కుషాయిగూడ పేరున డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం జమ్మిగడ్డ వాసులు తమ జమ్మిగడ్డ ప్రాంతాన్ని డివిజన్ గా ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు.

# డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ విభజనలో లోపించిన శాస్త్రీయత

**- తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు,**





**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ) :**స్పష్టమైన విధానం లేకుండా డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ ను అస్తవ్యస్తంగా తయారు చేశారని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ డిసిపి కృష్ణమోహన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ అస్తవ్యస్త విభజనను విరమించుకోవాలని కోరారు. దాదాపు 60 వేల మంది ఓటర్లు ఉన్న డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కు సంబంధించి ప్రభుత్వ అధికారులు స్పష్టమైన విధానం లేకుండా డివిజన్ లో ఉన్న కాలనీలను ఇతర డివిజన్ లలో కలిపి డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కు తీరని అన్యాయం చేశారని అన్నారు. న్యాయబద్దంగా అయితే డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ ను రెండు డివిజన్లు చేయాలన్నారు. మరి అధికారులు ఏ ప్రాతిపదికన ఇలా చేశారో అర్థం కావడం లేదన్నారు. డివిజన్ లో ఉన్న ఓటర్లను జంబ్లింగ్ పద్ధతిలో పక్క డివిజన్ లో వేసి డివిజన్ ను చిన్నదిగా చేసి అధికారులు చేతులు దులుపు కున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న డివిజన్ 15 కు సంబంధించి సుమారు 5 కిలోమీటర్ల వరకు విస్తరించి చాలా పెద్ద డివిజన్ చేశారని, ఇలా చేయటం వలన అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి డివిజన్ పునర్విభజన చేయాలని, పాలనా సౌలభ్యం కలిగించాలని ఆయన కోరారు. లేని పక్షంలో రాబోవు రోజుల్లో తెలంగాణ తెలుగు దేశం పార్టీ తరుపున వివిధ రూపాలలో నిరసన దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గడ్డమీది రాములు యాదవ్, టియన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ శివానంద్, సీనియర్ నేతలు గొట్టిపాటి వెంకటేశ్వరావు, నాగరాజు, గోబేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లవల్లి గ్రామానికి వెయ్యేళ్ల చరిత్ర

**- చారిత్రక ఆనవాళ్లను కాపాడుకోవాలి**

**- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి**



**హైదరాబాద్, డిసెంబర్,15, (తెలంగాణ దిశ) :** మెదక్ జిల్లా జన్నారం మండలం నల్లవల్లికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈఓ, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి చెప్పారు. గ్రామానికి చెందిన రాయారావు వెంకట రామారావు (ఆర్వీఆర్)ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం నాడు గ్రామ పరిసరాల్లో జరిపిన అన్వేషణలో బీరన్న గుడి వద్ద రాష్ట్ర కూటుల కాలపు (సా.శ. 10వ శతాబ్ది) నాటి నాలుగడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పు గల రాతిపై నిలబడి, నాలుగు చేతుల్లో డమరుకం, శూలం, ఖడ్గం, కపాల పాత్ర, తలపై విరి జడలను, వంటిపై కపాలమాలను ధరించిన భైరవ శిల్పం చారిత్రక ప్రాధాన్యత గలదని ఆయన అన్నారు. గ్రామంలోని 18వ శతాబ్దిలో రాయారావు దేశ్ ముకులు నిర్మించిన కోట (గడి), సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం, దాని ముందు కోనేరు (దిగుడుబావి) శిథిలావస్థలో ఉన్నాయని, చారిత్రక ప్రాధాన్యత గల ఈ వారసత్వ కట్టడాలను కాపాడుకోవాలి నల్లవల్లి గ్రామస్తులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే ఆర్గనైజర్లు నిబంధనలు పాటించాల్సిందే : డీసీపీ రితిరాజ్



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ) :** 2026 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఈ యేడాది డిసెంబర్ 31న నిర్వహించే వేడుకలకు సంబంధించి ఈవెంట్ ఆర్గనైజర్లు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని మాదాపూర్ డీసీపీ రితిరాజ్ ఆదేశించారు. గచ్చిబౌలి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే నిర్వాహకులు నిబంధనల ప్రకారం ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్, సీసీ కెమెరాలు తదితర విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్వాహకులు హాలు కెపాసిటీ మేరకే టిక్కెట్లు జారీ చేయాలని, అదనంగా సభ్యులను ఆహ్వానించడం వల్ల అసౌకర్యం కలిగి అనర్థాలు ఏర్పడతాయన్నారు. డ్రగ్స్ విషయంలో ఎటువంటి అతిక్రమణలు జరిగినా సహించబోమని హెచ్చరించారు. ఒకవేళ అటువంటి ఆనవాళ్లు ఏమైనా ఉంటే నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. 21లోగా దరఖాస్తు చేసుకోవాలి2025 డిసెంబర్ 31న ఈవెంట్స్ నిర్వహించాలనుకునే నిర్వాహకులు ఈ నెల 21వ తేదీ లోపు పోలీసు శాఖ పోర్టల్ (సిపిఎంఎస్) లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పరిశీలించిన తరువాత ఈవెంట్ నిర్వాహనకు అనుమతి లభిస్తుందని, అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీడియా సమావేశంలో మాదాపూర్ ఏసీపీ శ్రీధర్, గచ్చిబౌలి ఇన్ స్పెక్టర్ బాల్ రాజ్ తో పాటు ఇతర ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు.

## కుషాయిగూడ డివిజన్ గా పేరు మార్చాలని కోరుతూ

# కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా

### కుషాయిగూడ నుంచి సర్కిల్ కార్యాలయం వరకు ర్యాలీ... - రెండు గంటల పాటు బైఠాయించి నిరసన










**కుషాయిగూడ, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ):** జిహెచ్ఎంసి 16వ వార్డును కుషాయిగూడ డివిజన్ గా పేరు మార్చాలని కుషాయిగూడ, చర్లపల్లి కాలనీల కుటుంబాలు ముక్తకంఠంతో సర్కిల్ కార్యాలయం ఎదుట బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. సోమవారం కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ ల సంయుక్త ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్టాండ్ నుంచి డప్పు చప్పులతో ప్రారంభమైన నిరసన ర్యాలీ ఊరేగింపుగా ఈసీఐఎల్ చౌరస్తా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ మీదుగా కాప్రా సర్కిల్ కార్యాలయంకు చేరుకుంది. జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మొండి వైఖరి నశించాలి..., 16వ డివిజన్ ను కుషాయిగూడ డివిజన్ గా పేరు మార్చాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డు లు చేత పట్టుకొని దాదాపు రెండు గంటల పాటు దిక్కులు పిక్కటిల్లెల నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డిలు మాట్లాడుతూ దశాబ్దాల చరితగల కుషాయిగూడ ప్రాంతం కుషాయిగూడ డిపో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్, పారిశ్రామిక వాడ, మేడ్చల్ జిల్లా కోర్టుల సముదాయంను 16వ వార్డును కుషాయిగూడ డివిజన్ గా పేరు మార్చాలని కోరారు. కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి టెంపుల్ ను చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ జగన్ బయటకి రావడంతో సమస్త కుషాయిగూడ ప్రజానీకం ఆకాంక్ష అయిన డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, యావపురం రవి, సారా అనిల్ ముదిరాజ్, సారా వినోద్ ముదిరాజ్, చల్ల ప్రభాకర్, తాళ్ల ఆనంద్ గౌడ్, యావాపురం విశ్వనాథం, చిత్తుల కిషోర్, కళ్యాణ్, గణేష్, బాల నరసింహ, రమేష్ చౌదరి, రాజేష్ శర్మ, సోను చౌదరి, చల్లా వెంకటేష్, చందా సంతోష్, అశోక్ కుమార్ గుప్తా, చెన్నోజు భాస్కర్, వాసు, కిషోర్, రాగిరి సాకేత్ చంద్రమౌళి దయానంద్ సురేష్ గుప్తా, హరి నాయక్, సంపత్, కాసుల సురేష్ గౌడ్, శంకర్, లడ్డు, కొండగళ్ల అశోక్, బత్తుల రాజిరెడ్డి, శివలింగం, షాబాద్ దామోదర్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, సత్యనారాయణ, జై, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## 16వ డివిజన్ కు కుషాయిగూడ పేరు పెట్టాలని కోరుతూ

# వ్యాపారుల స్వచ్ఛంద బంద్ విజయవంతం



**కుషాయిగూడ,డిసెంబర్ 15, (తెలంగాణ దిశ) :** జిహెచ్ఎంసి పునర్వ్య వస్థీకరణలో భాగంగా 16వ డివిజన్ చక్రిపురంకు బదులు కుషాయిగూడ పేరు పెట్టాలని కోరుతూ వ్యాపారులు సోమవారం స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వ్యాపార సముదాయాలను బంద్ చేసి కుషాయిగూడ నుంచి కాప్రా సర్కిల్ కార్యాలయం వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. కుషాయిగూడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళన రోజురోజుకు ఉధృతం అవుతుంది. ఇందులో భాగంగా పునర్విభజన వినతులకు మరో రెండు రోజులు గడువు ఉండడంతో ఆందోళన కార్యక్రమాలు కొనసాగించాలని కుషాయిగూడ కాలనీ సంక్షేమ సంఘం నిర్ణయించింది. ఎంతో చారిత్రక ప్రాముఖ్యత ఉన్న కుషాయిగూడ పేరును డివిజన్ కు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# వాదన కావొద్దు వివాదం

ఆలుమగల మధ్య అలకలు అందమే! వాదోపవాదాలూ.. గిల్లికజ్జాలూ సర్వ సాధారణమే! ఇలా.. గొడవలకు దారితీయని అభిప్రాయబేధాలు మంచివేనట. అవి.. భార్యభర్తల నడుమ బంధాన్ని మరింత బలపరుస్తాయట. అయితే.. ఆ మనస్ఫర్థలను టీ కప్పులో తుఫానులా తేలిపోనివ్వాలి. నివురు గప్పిన నిప్పులా దాచేస్తే.. అసలుకే మోసం వస్తుంది. ఎంత అన్యోన్యంగా జీవిస్తున్నా.. దంపతులన్నాక ఏదో ఒక విషయంలో మాట పట్టింపులు వస్తుంటాయి. వాదోపవాదాలు, చిన్నచిన్న గొడవలు పడుతుంటారు. అయితే, కొందరు ఇలాంటి గొడవలను మొగ్గలోనే తుంచేసి అనుబంధాలను బలపర్చుకుంటారు. కొందరు మాత్రం.. పెద్దవిగా చేసి బంధాన్ని తెంచేసుకుంటారు. 'ది హెల్దీ మ్యారేజ్' డేటా ప్రకారం.. సగటున ప్రతి జంటా నెలకు రెండుమూడు సార్లు గొడవలు పడుతుంటాయట.

# భువనగిరి జిల్లాకు మరో రైల్వే స్టేషన్ అందుబాటులోకి తీసుకు వస్తా

### భువనగిరి డెవలప్ మెంట్ ఫోరం వినతికి ఎంపీ స్పందన... - ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**భువనగిరి, డిసెంబర్ 15, (తెలంగాణ దిశ) :** దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ గుంటూరు లైన్ లోని భువనగిరి మున్సిపల్ పరిధిలోని బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్ ను క్రాసింగ్ స్టేషన్ నుంచి హాల్టింగ్ స్టేషన్ గా మార్చడం వలన నిత్యం ఈ మార్గంలో 40 రైళ్లు తిరుగుతూ ఉంటాయని దీని వలన ఈ ప్రాంతం అభివృద్ధి పట్టణ విస్తరణ జరుగుతుందని భువనగిరి డెవలప్ మెంట్ ఫోరం వ్యవస్థాపకులు మెరుగు మధు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సోమవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఢిల్లీలోని ఎంపీ కార్యాలయమైన కావేరి భవన్ లో ఎంపీని కలసిన బిడిఫ్ సభ్యులు మాటూరి అశోక్ , కొత్త బాలరాజు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు భువనగిరికి రెండవ రైల్వే స్టేషన్ గా బొమ్మాయిపల్లి రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేయటం వల్ల యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాపార, వాణిజ్య పరంగా, ఆధ్యాత్మిక, పర్యాటక పరంగా మరింత నిర్మాణాత్మకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వెంటనే దక్షిణ మధ్య రైల్వే అధికారులతో మాట్లాడి త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ భువనగిరి రెండవ రైల్వే స్టేషన్ బొమ్మాయిపల్లిగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసినట్లయితే యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట దేవస్థానం భక్తులకు, జైనుల ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన కొలనుపాక, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భూదాన్ పోచంపల్లి చేనేతకు, అరుదైన భువనగిరి గుట్టకు పర్యాటకులు వేములకొండ దేవస్థానానికి భక్తులు, పర్యాటకులు పెరిగే ఈ ప్రాంతం రావడం వలన అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని వినతిపత్రంలో తెలిపారు. ఈ సందర్భంగా అభివృద్ధి కుంటు పడిన జిల్లాలోని ఐదు మున్సిపాలిటీ లకు రూ. 1000 కోట్ల నిధుల కోరగా బిడిఫ్ తో ఎంపీతో చర్చించారు. పూర్తి ప్రణాళికతో వస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. బీబీనగర్ ఎయిమ్స్ లో ఓపీ విపరీతంగా పెరిగిన కారణంగా రోగులకు సమస్యగా మారిందని చెప్పగా త్వరలో అన్ని సౌకర్యాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# ఫ్యూచర్ శంషాబాద్




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశవ్యాప్తంగా విమానాశ్రయాల సమీప ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ కొనసాగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చుట్టుముట్టిన గ్రామాలు, పట్టణాల్లో భూముల ధరలు ఆశ్చర్యకరమైన రీతిలో పెరిగినట్లు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా తర్వాతి కాలంలో ? అంటే 2021 నుంచి 2025 మధ్య ? ఈ పెరుగుదల మరింత వేగంగా నమోదైందని నివేదికలు చెబుతున్నాయి. విమానాశ్రయానికి 50 కిలోమీటర్ల పరిధిలో డిమాండ్ కొనసాగుతోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. విమానాశ్రయం అభివృద్ధికి ముందు, శంషాబాద్ పరిధిలో భూముల రేట్లు చాలా తక్కువగా ఉండేవి. 1990ల చివరలో చదరపు గజం ధర రూ.500లోపే ఉండేదని అప్పటి రియల్ ఎస్టేట్ డీలర్లు చెబుతున్నారు. కానీ ఇప్పుడీ ప్రాంతం పూర్తిగా మారు రూపం దాల్చింది. శంషాబాద్, బుద్వేల్, సాతంరాయి, మామిడిపల్లి, తుక్కుగూడ వంటి ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, విల్లా ప్రాజెక్టులు భారీగా నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ విమానాశ్రయానికి 25–50 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయిరియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ స్క్వేర్యార్డ్స్ ప్రకారం, గత ఐదేళ్లలో విమానాశ్రయం సమీప భూగర్భాలు సగటున 74 శాతం ధరల పెరుగుదలను చవిచూశాయి. అపార్ట్‌మెంట్ల ధరలు చదరపు అడుగుకు రూ.6,000 నుంచి రూ.8,000 మధ్యగా ఉండగా, ఇతర ప్రముఖ ప్రాంతాల్లో అదే చదరపు అడుగు ధర రూ.9,000 నుంచి రూ.11,000 వరకు ఉంది. స్థలాల విషయంలో చూస్తే, విమానాశ్రయం సమీపంలో చదరపు గజం ధరలు రూ.55,000 నుంచి రూ.60,000 మధ్య ఉన్నాయి. అదే సమయంలో ఇతర నగర ప్రాంతాల్లో ఇవే రేట్లు రూ.75,000 నుంచి రూ.80,000 వరకు వెళుతున్నాయి.వాస్తవానికి ఇప్పటివరకు శంషాబాద్ చుట్టుపక్కల అభివృద్ధి ఆశించిన స్థాయికి చేరలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జీవో 111 పరిమితులు, పరిశ్రమలు లేకపోవడం వంటి కారణాలు ప్రధానమైనవని వారు చెబుతున్నారు. అయినప్పటికీ, గత నాలుగైదేళ్లుగా దక్షిణ హైదరాబాద్ వైపు అభివృద్ధి బాగా ఊపందుకుంది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో ఎకరం స్థలానికి రూ.4 కోట్లు పలుకుతుండగా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో చదరపు గజం రూ.5,000 నుంచి రూ.10,000 మధ్యలో దొరికే అవకాశముంది. విల్లాల ధరలు రూ.కోటికి పైగానే ఉంటున్నాయి. ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా శంషాబాద్, తుక్కుగూడ, మహేశ్వరం ప్రాంతాల్లో మౌలిక వసతుల విస్తరణకు ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి. నాగోల్ నుంచి ఆరంఘర్ మీదుగా విమానాశ్రయం వరకు మెట్రో రైలు విస్తరణ (లైన్ 2ఏ) ప్రతిపాదించబడింది. రాజేంద్రనగర్‌లో కొత్త హైకోర్టు భవనం నిర్మాణం జరుగుతోంది. శ్రీశైలం– నాగార్జునసాగర్ రహదారుల మధ్యలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరగనుంది, ఇది విమానాశ్రయానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ యోచనలో ఉంది. మహేశ్వరం పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. ఇటీవల ఓ జ్యువెలరీ తయారీ యూనిట్‌కు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం కూడా జరిగింది.పలు బడా నిర్మాణ సంస్థలు రిటైర్మెంట్ హోమ్స్, టౌన్షిప్‌లు నిర్మించేందుకు ఆధ్యాత్మిక కేంద్రాలు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతున్నాయి. ప్రాంతీయ వలయ రహదారి పూర్తయ్యే దశలో ఉండటంతో, శంషాబాద్ పరిధి రాబోయే కాలంలో భారీగా అభివృద్ధి చెందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# తెలంగాణకు భారీగా పెట్టుబడులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ కలను నిజం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టి, పట్టుదలతో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ హిటెక్స్ సెంటర్‌లో ప్రారంభమైన ఇన్వెస్టోపియా గ్లోబల్ సమిట్‌లో రాష్ట్ర ఐటీ ఇండస్ట్రీస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి దిశగా జరుగుతున్న పరిణామాలను వివరించారు. యూఏఈ పారిశ్రామికవేత్తలు తెలంగాణతో భాగస్వామ్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, “తెలంగాణ భౌగోళికంగా చిన్నదైనా, లక్ష్యాలు మాత్రం గొప్పవే. తక్కువ కాలంలోనే ఫీనిక్స్ పక్షిలా అభివృద్ధి సాధించింది. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వృద్ధి 8.2%గా నమోదైంది. ఇది దేశ సగటు వృద్ధి రేటు 7.6% కంటే ఎక్కువ. రాష్ట్రం జాతీయలో 5% కంటే ఎక్కువ వాటా అందిస్తోంది. ఈ గణాంకాలు తెలంగాణ వేగవంతమైన అభివృద్ధిదిశగా వెళ్తోందని స్పష్టంగా చూపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశ్రమల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. డ్రైపోర్టులు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, జోన్లు, నెట్–జీరో పార్కులు, గ్రీన్ లాజిస్టిక్స్ హబ్‌లు, ప్రాంతీయ రింగ్ రోడ్ మరియు మెట్రో రైలు ఫేజ్–2 ప్రాజెక్టులు పరిశ్రమలకు మరింత ఊపు ఇస్తున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ ప్రాజెక్టులు అమలు అయితే తెలంగాణ పెట్టుబడిదారులకు ప్రధాన కేంద్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణను భవిష్యత్తులో గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చడానికి ‘ఫ్యూచర్ సిటీ’ ప్రాజెక్ట్ కీలకం కానుంది. ఫిన్‌టెక్, క్లైమేట్ టెక్, స్మార్ట్ మొబిలిటీ ఇన్నోవేషన్స్ కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి జరుగుతోంది. ల్యాబ్స్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు,

డేటా సెంటర్లు, ఏరోస్పేస్ క్లస్టర్లు.. ఇవన్నీ రాష్ట్రాన్ని టెక్నాలజీ కేంద్రంగా నిలుపుతున్నాయి. గత 18 నెలల్లోనే తెలంగాణలో రూ. 3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం రాష్ట్ర పరిశ్రమల శక్తిని సూచిస్తోంది. 2024– 25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయి. ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సర్వీసులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు ఈ వృద్ధిలో కీలకపాత్ర పోషించాయి. లూలూ గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి ప్రముఖ యూఏఈ కంపెనీలు ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం రేవంత్ రెడ్డి విజన్‌ను మరింత బలపరుస్తోంది.

ఈ ఇన్వెస్టోపియా సమ్మిట్ అనేది పాత స్నేహితుల పునర్మిళకలాంటిది. యూఏఈలా తెలంగాణ కూడా సమయాన్ని, నమ్మకాన్ని, మార్పును విలువైనవిగా భావిస్తుందని శ్రీధర్ బాబు అన్నారు. ఈ సమ్మిట్‌లో యూఏఈ ఎకానమీ టూరిజం మంత్రి అబ్దుల్లా బిన్ తూక్ అల్ మార్రీ, తెలంగాణ ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, శశాంక్, యూఏఈ మినిస్ట్రీ ఆఫ్ ఇన్వెస్ట్మెంట్ అండర్ సెక్రటరీ మొహమ్మద్ అల్ వాహైబి, యూఏఈ ఇంటర్నేషనల్ ఇన్వెస్టర్స్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ వాలీద్ హారెబ్ అల్ ఫలాహి, ఇన్వెస్టోపియా అఖాజీన్ ఫారెస్ పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో తెలంగాణ అభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ప్రతి పౌరుడు గర్వపడే విధంగా రాష్ట్రం ఎదుగుతూ ఉండటం ఆనందకర విషయం. రాబోయే సంవత్సరాల్లో పెట్టుబడులు, ఎగుమతులు, సాంకేతికత, మౌలిక సదుపాయాల కలయికతో తెలంగాణను ఒక బ్రాండ్‌గా మార్చాలనే లక్ష్యం ప్రభుత్వానికి ఉందని మంత్రి స్పష్టంగా చెబుతున్నారు

# సైన్స్ పై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించాలి




**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ:** విద్యార్థులలో సైన్స్ పై ఆసక్తిని పెంపొందించడంతో పాటు నాణ్యమైన విజ్ఞాన విద్యను అందించేందుకు ప్రథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టెమ్ ఎడ్యుకేషన్ ఫర్ ఇన్నివేషన్ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చాంబర్ లో ప్రథం ఫౌండేషన్ బృందంతో కలిసి, జిల్లాలోని పాఠశాలల్లో సైన్స్ బలోపేతానికి చేపట్టనున్న కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ అంశాలపై అవగాహన పెంచేలా ఆన్లైన్ వీడియోలు, టీచర్లకు ప్రత్యేక గైడెన్స్, స్టెమ్ ఆధారిత బోధన విధానాలు అమలుచేయనున్నట్లు ఆయన వివరించారు. ప్రథం ఫౌండేషన్ ద్వారా అందించే స్టెమ్ ప్రోగ్రామ్‌ను జిల్లాలోని ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఫౌండేషన్ అందించే బోధన సామగ్రి(మెటీరియల్) అన్ని పాఠశాలలకుచేరే విధంగా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి బి. స్వామి, ఏఎమ్ఓ విజయపాల్ రెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ రాజగోపాల్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల రిసోర్స్ పర్సన్స్, ప్రథం ఫౌండేషన్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటికి రుణాలు!



**ఖమ్మం,తెలంగాణ దిశ :**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. పునాది నిర్మాణానికి ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందిస్తున్నారు. లబ్ధిదారులు రూ.1లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం పొంది నిర్మాణం ప్రారంభించవచ్చు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1.74 లక్షల మంది పనులు మొదలుపెట్టారు. ఖమ్మం జిల్లాలో1,900 మందికి పైగా రూ.22.83 కోట్ల రుణాలు మంజూరు కాగా, మరిన్ని జిల్లాల్లో రుణాలు మంజూరు చేయనున్నారు.తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. అయితే ముందు లబ్ధిదారులు ఖర్చు పెట్టుకుంటే ఇంటి నిర్మాణం జరిగే వివిధ దశల్లో మె?త్తం 4 విడతలుగా రూ.5 లక్షల సాయం అందిస్తారు. అయితే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో చాలామంది ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. పునాది స్థాయి వరకు నిర్మాణం పూర్తయితేనే మొదటి విడతగా రూ.లక్ష సాయం ప్రభుత్వం నుండి అందుతాయి. ఈ దశను చేరుకోవడానికి కూడా డబ్బులు లేక కొందరు నిరుపేదలు మంజూరు పత్రాలను వెనక్కి ఇచ్చే పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో సర్కార్ తీపి కబురు చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నిరుపేద లబ్ధిదారులకు డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఇల్లు కట్టుకోవడానికి రూ. 1 లక్ష వరకు రుణం మంజూరు చేస్తున్నారు. ఈ రుణ సాయం రాష్ట్రంలోని పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఊతమిస్తోంది. రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్ మినహా మొత్తం 3.68 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. ఇందులో ఇప్పటికే 1.74 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. తొలి విడత బిల్లు పొందడానికి కూడా ఆర్థిక స్థోమత లేని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, స్త్రీనిధి ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.1లక్ష వరకు రుణం పొందవచ్చు. చెల్లించే సామర్థ్యం ఉన్నవారికి రూ. 2 లక్షలు వరకు కూడా రుణాలు మంజూరు చేస్తున్నారు.ఈ రుణాలు పొందిన కొందరు లబ్ధిదారులు, పునాది దశ దాటి మొదటి బిల్లు అందుకున్న తర్వాత రుణభారాన్ని తగ్గించుకుంటున్నారు.

# మెడికల్ లీవ్ లో పైలెట్లు!

ముంబై, : అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ దుర్ఘటన తర్వాత నాలుగు రోజుల్లో 100 మందికిపైగా ఏయిరిండియా పైలట్లు మెడికల్ లీవ్ తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేసింది. కేంద్ర పౌరవిమాన యాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహుల్ లోక్‌సభలో ప్రసంగిస్తూ.. 274 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ విషాద ఘటనపై పైలట్ల మానసిక ఆరోగ్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది అని అన్నారు. విమాన ప్రమాదం జరిగిన రోజే 51 మంది పైలట్లు, 61 మంది ఫ్లైట్ ఆఫీసర్లు లీవ్ పెట్టడం ప్రభుత్వం దృష్టిని ఆకర్షించింది.ఇటువంటి ఘటనల తర్వాత సిబ్బందిలో మానసిక ఒత్తిడిని గుర్తించి, దాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది” అని మంత్రి వ్యాఖ్యానించారు. 2023 ఫిబ్రవరిలోనే కేంద్రం అన్ని ఎయిర్‌లైన్స్‌కు పలు సూచనలు చేసింది. వైద్య పరీక్షల సమయంలో పైలట్ల మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడం, పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, పియర్ సపోర్ట్ గ్రూపులు ఏర్పాటు చేసి, పైలట్లు, ఏటీసీలకు మానసిక ఒత్తిడిని గుర్తించేందుకు, ఎదుర్కొనేందుకు సహాయం చేయాలని సూచించింది.కాగా, సిబ్బంది విశ్రాంతి, శిక్షణ, ఆపరేషన్ లోపాలపై డీజీసీఏ నుంచి నాలుగు షోకాజ్ నోటీసులు అందినట్టు ఎయిరిండియా ధ్రువీకరించింది. గతేడాది తమ సంస్థ అందజేసిన స్వచ్ఛంద నివేదిక ఆధారంగా ఈ నోటీసులు జారీ అయినట్టు తెలిపింది. ఎయిరిండియా ప్రతినిధి స్పందిస్తూ: ‘మా స్వచ్ఛంద నివేదికల ఆధారంగా వచ్చిన నోటీసులే... వాటికి తగిన విధంగా స్పందిస్తాం? సిబ్బంది, ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీలేదు’ అన్నారు. కాగా, గత ఆరు నెలల్లోనే ఎయిరిండియాకు 13 భద్రతా ఉల్లంఘనల నోటీసులు రావడం గమనార్హం.రెండు రోజుల కిందట హాంకాంగ్ నుంచిడి ఢిల్లీకి వచ్చిన ం321 విమానంలో ల్యాండ్ అయిన కాసేపటికే మంటలు చెలరేగాయి. దీనికి ముందు రోజు కోచి–ముంబయి ఫ్లైట్ రన్‌వే అదుపుతప్పడంతో ఇంజిన్ కవర్ దెబ్బతింది. అలాగే, ఢిల్లీ–కోల్‌కతా విమానం చివరి నిమిషంలో టేకాఫ్ నిలిచిపోయింది. ఇలా వరుస ఘటనలు ఎయిరిండియా విమానాల్లో భద్రతపై ఆందోళనకు గురిచేస్తున్నాయి. అటు, అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక అందజేసింది. పైలట్లు ఇంధనం స్విచ్ఛ ఆఫ్ చేసినట్టు కాక్‌పిట్ వాయిస్ రికార్డులో ఉందని విదేశీ మీడియా కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను పైలట్ల సంఘం, విమానయాన నిపుణులు తీవ్రంగా ఖండిస్తున్నారు. బోయింగ్ విమానాలు నడుపుతున్న అన్ని దేశీయ విమానయాన సంస్థలకు ఇంధన స్విచ్‌లను పరీక్షించాలని డీజీసీఏ ఆదేశించింది.

# రోజా నోరు తెస్తున్న తంటా!



**తిరుపతి,తెలంగాణ దిశ :** వైసీపీకి మాజీ మంత్రి రోజా లాంటి వారుఅస్సెట్ అవుతారనుకుంటే భారంగా మారుతున్నారు. బరువుగా పార్టీకి తయారవుతున్నారు. అరెస్ట్ లతో కాస్తో కూస్తో వైసీపీకి సానుభూతి లభిస్తుందని భావిస్తే, రోజా లాంటి వారితో ఉన్నదంతా తుడిచిపెట్టుకుపోతుంది. రోజా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగానే కాదు.. సాధారణ జనానికి కూడా మంట తెప్పిస్తున్నాయి. రోజా లాంటి నేతల నోళ్లను కొన్నాళ్ల పాటు అదుపులో పెట్టకపోతే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ తీరని నష్టం జరుగుతుందన్న విశ్లేషణల్లో వాస్తవ ముంది. రోజా నోటికి ప్లాస్టర్ వేయాలని సొంత పార్టీ నేతలే కోరుతున్నారంటే ఆమె ఏ రేంజ్ లో మాట్లాడిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జగన్ ఇటువంటి నేతల విషయంలో సీరియస్ డెసిషన్ తీసుకోవాలంటున్నారు ఆర్కే రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టాల్సిందే. అయితే ఆ వ్యాఖ్యలతో వచ్చిన సానుభూతిని రోజా తన వ్యాఖ్యలతో తనకు తానే చెరిపేసుకున్నారు. పార్టీని కూడా డ్యామేజ్ చేశారు. నగరిలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమంలో పాల్గొన్న రోజా రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా గాలిలో గెలిచిన గాలిగాళ్లే ఎక్కువైపోయారంటూ విమర్శలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ వీకెండ్ నాయకులు అని ఫైర్ అయ్యారు. ఒక్కరు కూడా ప్రజల దగ్గరికి వెళ్లి వాళ్ల కష్టం ఏంటో అడగరని రోజా అన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే టీడీపీ, జనసేన నేతలు అమెరికా పారిపోవాలని చెప్పారు. చంద్రబాబు డబ్బులు ఎక్కువగా ఇస్తున్నారని అందుకే పవన్ కళ్యాణ్‌కు పిచ్చి బాగా ముదిరిపోయిందంటూ ఆరోపించారు... రాష్ట్రంలో గాలిలో గెలిచిన గాలిగాళ్లు ఎక్కువైపోయ్యారు. ఇప్పుడే హైదరాబాద్‌కు పారిపోయే వాళ్లు.. రేపు జగనన్న ప్రభుత్వం వస్తే వీళ్లుహైదరాబాద్ కాదు.. అమెరికాకు పారిపోతారంటూ రోజా చేసిన వ్యాఖ్యలు పార్టీని ఖచ్చితంగా ఇబ్బది పెట్టేవే. ఆ రోజు మిమ్మల్ని కాపాడటానికి ఎవ్వరు ఉండరని, వీళ్లని నమ్మితే ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లని మీరు టార్చర్ పెట్టినా.. కేసులు పెట్టించినా.. కొట్టినా..దానికి 100 రెట్లు మీకు వడ్డీతో కూడా తిరిగి ఇచ్చేస్తామంటూ రోజా చేసిన హెచ్చరికలతో కాస్తో కూస్తో వైసీపీ నేతల వరస అరెస్ట్ లతో వచ్చిన సానుభూతి పోయిందని అంటున్నారు. రోజాకు ఆవేశం తప్ప ఆలోచన లేదని, సినీ రంగం నుంచి రావడంతో డైలాగులు ఆకట్టుకునేలా అనిపించినా అవి మాత్రం వచ్చే ఓట్లను రాకుండా చేస్తాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# చెత్త ఇవ్వండి... డబ్బులు తీసుకోండి

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ శాఖ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వచ్ఛ రథం పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పనికిరాని వస్తువులను సేకరిస్తారు. వాటికి బదులుగా డబ్బులు లెక్కించి, అవసర మైన సరుకులు ఇస్తారు. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం ఈ నెల 10న ప్రారంభమైన సంగతి తెలిసిందే.. తాజాగా ఎన్టీఆర్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. పైలట్ ప్రాజెక్టు కు ఎంపిక చేశారు. ఈ మేరకు ఒక వాహనాన్ని అద్దెకు తీసుకున్నారు.. దానిని స్వచ్ఛ రథంలా మార్చారు. ఆగస్టు1 నుంచిఅధికారులు రోజూ రెండు వార్డులు తిరిగేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేశారు. ఈ మేరకు వారంలో రెండు సార్లు గ్రామాల్లో ఇళ్ల దగ్గరకు వెళ్లి చెత్తను సేకరిస్తారు.. వాటికి బదులు డబ్బులు లెక్కగట్టి వాహనం వెనుక భాగంలో ఉండే నిత్యావసర సరుకులు ఇస్తారు. వాహనం ముందు భాగంలో పొడి చెత్తను ఉంచుతారు. ఈకార్యక్రమం విజయవంతమైతే ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తామంటున్నారు.గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో స్వచ్ఛరథం ద్వారా చెత్త, వ్యర్థాలను సేకరించి వాటికి డబ్బులు విలువ కట్టి సరుకులు ఉచితంగానే అందజేస్తున్నారు. గుంటూరు సమీపం లోని 11 గ్రామాలకు స్వచ్ఛ రథం ప్రతి 15 రోజులకోసారి వెళ్లేలా ప్లాన్ చేశారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో వేయాలని సూచిస్తున్నారు. ప్రజలు ఆ వ్యర్థాలను తీసుకొచ్చి స్వచ్ఛ రథం దగ్గర అప్పగిస్తే.. తూకం వేసి కిలోకి రూ. 16 నుంచి రూ. 20 వరకు విలువ కడుతున్నారు. ఆ తర్వాత ఆ విలువను బట్టి నిత్యావసరాలు, వస్తువులు అందజేస్తున్నారు. స్వచ్ఛ రథం సిబ్బందికి ప్యాకెట్లు, ప్యాకింగ్ కవర్లు, పాత పేపర్లు, గాజు సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, పనికిరాని వస్తువులు, అట్టలు, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు, కంప్యూటర్లకు సంబంధించిన వస్తువులు, నూనె డబ్బాలు ఇలా పనికిరాని వస్తువుల్ని తీసుకొచ్చి ఇవ్వొచ్చు. ఈ స్వచ్ఛ రథం పర్యవేక్షణ కోసం సచివాలయం లోని ఓ ఉద్యోగిని కేటాయించారు అధికారులు.

# పీహెచ్‌సీలలో డీపీటీ వ్యాక్సిన్ కొరత?

**- నెల రోజులుగా అందుబాటులో లేని డీపీటీ వ్యాక్సిన్..!**

**- సబ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్న చిన్నారులు, తల్లిదండ్రులు..?**




**బీబీనగర్,తెలంగాణ దిశ :** గత నెల రోజులుగా వ్యాక్సిన్ కొరతతో అంగన్‌వాడీ సెంటర్లు, సబ్ సెంటర్ల చుట్టూ చిన్నారులు, తల్లిదండ్రులు తిరుగుతున్నారు. ఐదు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు డీపీటీ ( డిఫ్తీరియా, పెర్టుస్సిస్ టెటానస్ ) అనే వ్యాక్సిన్ వేయాల్సి ఉన్నా గత నెల రోజులుగా వ్యాక్సిన్ కొరత కారణంగా టీకాను వైద్యులు అందించలేకపోతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఈ వ్యాక్సిన్ కొరత ఉన్నదని, సెంటర్లలో స్టాక్ లేనందున ఆరోగ్య కేంద్రాల్లో చిన్నారులకు టీకా వేయలేకపోతున్నామని ఆశా కార్యకర్తలు, ఏ ఎన్.ఎం లు తెలిపారు. కాగా వ్యాక్సిన్ అందుబాటు లో ఉన్నది లేనిది సరైన సమాచారం లేక తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మానిపించి సబ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఉదయం ప్రార్థనలో భగవద్గీత శ్లోకాల పారాయణం..

## ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి చేసిన సర్కార్

డెహ్రాడూన్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం ప్రార్థనలో భగవద్గీత శ్లోకాల పారాయణాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ మేరకు పుష్కర్‌సింగ్ ధామీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. సాంప్రదాయ భారతీయ జ్ఞానాన్ని ఆధునిక విద్యతో మిళితం చేయడం, విద్యార్థులలో స్వీయ క్రమశిక్షణ, నాయకత్వం, భావోద్వేగ సమతుల్యత వంటి విలువలను ప్రోత్సహించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ప్రతిరోజూ ఒక గీతా శ్లోకాన్ని పఠించడంతోపాటు, దాని అర్థం, ఔచిత్యాన్ని విద్యార్థులకు వివరించాలని ఆదేశించింది. ఉపాధ్యాయులు ప్రతీ వారం ఒక శ్లోకాన్ని ఎంచుకోవాలని, దానిని అర్థంతోపాటు పాఠశాల నోటీసు బోర్డులో రాయాలయని సూచించింది. విద్యార్థులు దానిని నేర్చుకునేలా ప్రోత్సహించాలని తెలిపింది. క్లాస్‌రూం యాక్టివిటీలో భాగంగా వారంలో చివరలో ఆ శ్లోకంపై చర్చ, విద్యార్థుల అభిప్రాయం తీసుకోవాలని పేర్కొంది. ఇది భారతదేశ సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలను ఆధునిక విద్యా చట్రంలో ఏకీకృతం చేయడాన్ని నూతన జాతీయ విద్యా విధానం ప్రోత్సహిస్తున్నదని వెల్లడించింది. కాగా, విద్యార్థులలో నైతిక విలువలు, భారతీయ సంస్కృతి, వారసత్వం



పట్ల అవగాహన పెంచడానికి పాఠ్యపుస్తకాలలో పవిత్ర గ్రంథాలైన భగవద్గీత, రామాయణాన్ని చేర్చాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ కి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దీనిని రాష్ట్రంలోని 17వేల ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. భారతీయ సంస్కృతికి అద్దం పట్టే గ్రంథాలను పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా విద్యార్థులలో విలువలతో కూడిన విద్యను అందించవచ్చని విద్యాశాఖ మంత్రి ధన్ సింగ్ రావత్ తెలిపారు. ఈ గ్రంథాలు కేవలం మత పరమైనవి కావని, జీవితానికి అవసరమైన నైతిక విలువలు, జీవన విధానాన్ని బోధిస్తాయన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

## - జిఎం వీసం. కృష్ణయ్య



భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య ఆదేశాల మేరకు సింగరేణిలో సంక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ డాక్టర్ డి. లలిత అన్నారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.లలిత మాట్లాడుతూ వర్షాలతో ఎక్కువ నీరు నిలవడం ద్వారా దోమల బెడదత తీవ్రంగా ఉంటుందని, నివాస ప్రాంతాల్లో మురికి నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తద్వారా దోమలు దరిచేరవని డెంగ్యూ, మలేరియా లాంటి ప్రాణాం తక వ్యాధులు సోకకుండా జాగ్రత్తలుతీసుకోవాలని అన్నారు. వర్షాకాలంలోకలుషితమైన నీరు, ఆహారం, ఈగలు మరియు దోమల వల్ల వ్యాధులు ప్రబాలే ప్రమాదం ఉంది. ముఖ్యంగా టైఫాయిడ్, కామెర్లు, విరోచనాలు, మలేరియా, డెంగ్యువంటి వ్యాధులు ప్రబలుతాయి. కాచి చల్లార్చిన నీటిని త్రాగ డం, బాగా ఉడికించిన ఆహారాన్ని తీసుకోవడం, నీటి పాత్రలపై,వంట పాత్రలపై మూత పెట్టి ఉంచడం, మల విసర్జన చేసిన తర్వాత, ఆహారం తినే ముందు చేతులను సబ్బుతో కడుక్కోవడం వంటి చర్యల ద్వారా ఆరోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.దోమలు పగటిపూట కుడతాయని, దోమ కుట్టిన ఐదు నుంచి ఎనిమిది రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు కనిపిస్తుంటాయ న్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను మట్టిలో పూడ్చడం, మురికి కాల్వల్లో చెత్త పేరుకోకుండా చూసుకోవడం, ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు పగిలిన కుండలు ఉంటే వాటిని తీసివేయడం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవచ్చు దోమకాటు బారిన పడకుండా తగు జాగ్రత్తలు (దోమతెరలు, పొడవు చేతులుండే దుస్తులు) తీసుకోవడం వల్ల మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు.

ఈ కాలంలోనే డెంగ్యూ వేగంగా వ్యాప్తి చెందుతుందని, ఈ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం మంచిదన్నారు. డెంగ్యూను నివారించడానికి ఎలాంటి టీకాలు లేవు. దోమ కాటుకు గురి కాకుండా నివారణ చర్యలు మాత్రమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకో వాలని, నీరు నిలువ ఉంటే వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి స్కూల్ హెడ్ మాస్టర్ బి.శ్రీనివాస్, ఇన్ ఛార్జ్ హెయం బొదుల శ్రీనివాస్, సినియర్ టీచర్స్ విషు ప్రియ, ధనలక్ష్మి, యాన్.సి.సి. మాస్టర్ శ్రీనివాస్ మరియు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సేమ్ సీన్... ఆల్ పార్టీస్!


**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలోని ఏదైనా గ్రామంలోకి వెళ్లి కాంగ్రెసోళ్ల గురించి అడిగితే తిడుతున్నారు. మరి బీఆర్ఎస్ సంగతేంది అంటే మద్దతుగానూ మాట్లాడడం లేదు. అసలు బీజేపీని పట్టించుకోవడం లేదు. ఇలాంటి దృశ్యం తెలంగాణలో ఎప్పుడూ లేదు. ఏదో ఒక పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు ఇక్కడి వారు. కానీ ఎందుకో ఇప్పుడు మూడు ప్రధాన పార్టీల విషయంలో జనాల్లో విముఖత స్పష్టంగా కనిపిస్తోంది. కొత్త శక్తులు, పార్టీలు వచ్చే స్కోపు లేదు. సో ఈ మూడింటిలోనే ఒకదాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతానికి ఏ పార్టీకి కూడా అంతగా ఎడ్జ్ లేని వాతావరణం అయితే స్పష్టంగా కనిపిస్తోంది.తెలంగాణ ప్రజల తీర్పు ఖచ్చితంగా ఉండేది.. అనాదిగా ట్రాక్ రికార్డ్ చూస్తే ఏదో ఒక పార్టీకి పట్టం కట్టేవారు. క్లియర్ కట్ మెజార్టీ అయితే ఈ ప్రాంతంలో వచ్చేది. ప్రజలు సూటిగా సుత్తిలేకుండా ఆలోచించేవారు. అయితే తెలంగాణలో పార్టీలు ఎక్కువయ్యాయి. మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన అయినట్టు.. జనాలు మారిపోయారు. మూడు పెద్ద పార్టీలు.. మధ్యలో చిన్నా చితక పార్టీలతో మొత్తం కలగపులగంగా తయారైంది.తెలంగాణలో బరువుకు మించి హామీలతో గద్దెనెక్కింది కాంగ్రెస్ సర్కార్. రేవంత్, నేతల దూకుడుతో.. బోలెడంత సంక్షేమం, అభివృద్ధి, వేలకు వేలు అకౌంట్లో పడిపోతాయిన జనం భ్రమించి ఓటేశారు. కానీ తెలంగాణ అప్పుల్లో కూరుకుపోయిందని.. కేసీఆర్ అప్పుల పాలు చేశాడని రేవంత్ జరుపుకుంటూ వచ్చేశారు. మొత్తానికి కిందా మీదా పడి డబ్బులు సర్దుకుంటూ సంక్షేమం పంచుతున్నా.. కొందరికి పడుతూ.. మరికొందరికి పడక వ్యతిరేకత అయితే బాగా స్ప్రెడ్ అవుతోందని క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. ఎవరినీ అడిగినా కాంగ్రెస్ గురించి ప్రస్తుతానికి పాజిటివ్ గా స్పందించడం లేదు..మరి ఈ వ్యతిరేకత బీఆర్ఎస్ పై పాజిటివ్ గా మారుతుందా అంటే అదీ లేదు. ఎందుకంటే గత ప్రభుత్వంలో కేసీఆర్ ప్రజలు, ప్రజాప్రతినిధుల కు దూరంగా పాలించారు. జనాలకు డైరెక్టుగా కనెక్ట్ కాలేకపోయారు. కొన్ని పథకాలు, సంక్షేమం బాగానే ఉన్నా.. బీఆర్ఎస్ నేతలు జనంలోకి రాకపోవడం వారిపై వ్యతిరేకతకు కారణమైంది. కాంగ్రెసోళ్లు మొత్తం జనాల్లోనే ఉండడం.. తెలంగాణ పట్టణ జనాభా కంటే గ్రామీణ జనాభా మొత్తం కాంగ్రెస్ వెంట నడిచింది. అసలు గ్రామాల్లోకి వెళ్లని బీఆర్ఎస్ ఓడిపోయింది. ఎమ్మెల్యే సీట్లు అన్నీ కూడా కాంగ్రెస్ రూరల్ లోనే గెలిచింది. బీఆర్ఎస్ ఎప్పుడైతే జనానికి దూరమైందో అదే వారి ఓటమికి కారణమైంది. ఇప్పటికీ కాంగ్రెస్ ను తిడుతున్నా.. బీఆర్ఎస్ నేతలు జనంలోకి రారు.. రాలేరు అన్న అపప్రదతో ఆ పార్టీకి మనస్ఫూర్తిగా జనాలు అనుకూలత చూపించడం లేదు..మరి బీజేపీది మరో కథ.. రెండేళ్లకోసారి అధ్యక్షుడిని మారుస్తూ ఏ బీజేపీ నేత ఎప్పుడు ఉంటారో.. ఎవరు నడిపిస్తారో.. అసలు నడిపిస్తామన్న వారికి అధ్యక్ష పీఠం ఎందుకు ఇవ్వరో అర్థం కాని పరిస్థితి. ఒక బలమైన నాయకుడిని ఎదగనీయకుండా కేంద్ర బీజేపీ నాయకత్వం తెలంగాణలో అసలు ఎలాంటి స్ట్రాటజీని అమలు చేస్తుందో బీజేపీ రాష్ట్ర నేతలకు కూడా అర్థం కాని పరిస్తితి. రాజాసింగ్ లాంటి నేతలు దీనిపై నిలదీస్తే 'గెట్ అవుట్' అంటూ గెంటించేస్తు న్నారు.

తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో పట్టుమని పాతిక నియోజకవర్గాలకు కూడా బలమైన నేతలు, క్యాడర్ లేదు. ఇదే బీజేపీని తెలంగాణకు దూరం చేస్తోంది. సోదిలో లేకుండా చేస్తోంది..ఏతావాతా చెప్పొచ్చేది ఏంటయ్యా అంటే.. తెలంగాణలో ప్రస్తుతం ఏ పార్టీని చూసినా ఏమున్నాది గర్వకారణం అన్నట్టుగా ఉంది.

## మందు బాబులకు షాక్.. మళ్లీ పెరగనున్న మద్యం ధరలు..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**మందుబాబులకు షాకింగ్ న్యూస్.. త్వరలోనే మళ్లీ మద్యం ధరలు పెంచేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే బీర్ల ధరలను 15 శాతం పెంచిన ప్రభుత్వం ఇప్పుడు లిక్కర్ ధరలు పెంచాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ అధికారులతో సమీక్షించిన అనంతరం ధరల పెంపుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.రెం డు, మూడు విధానాల్లో లిక్కర్ ధరలను పెంచి ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. ఏయేవిధానం ద్వారా ఎంత ఆదాయం ప్రభుత్వానికి పెరుగుతుందో కూడా ఆ నివేదికల్లో వెల్లడిస్తారు. అధికారులతో సమీక్షించిన తర్వాత మరింత లోతైన అధ్యయనం చేసి ధరలపెంపుపై నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ఏడాదికి తక్కువలో తక్కువ అనుకున్నా రూ.2000కోట్లు అదనపు రాబడి రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని అధికారు లు అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలను పెంచిన సంగతి తెలిసిందే. బీర్ల ధరలను 15 శాతం వరకు పెంచుకునేందుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ధరల పెరగడంతో ఒక్కో బీరుపై సగటున రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగింది.

# సీనియర్లకు మళ్లీ ఆశలు




**కాకినాడ,తెలంగాణ దిశ :**టీడీపీ అతిపెద్ద రీజనల్ పార్టీ. పైగా బలహీనవర్గాలకు పెద్దపీట అనే నినాదంతో వచ్చిన ఆ పార్టీ..ఎందరో సామాన్యులను నాయకులుగా తయారు చేసింది. అలా నాలుగున్నర దశాబ్దాల టీడీపీ పార్టీలో..సీనియర్ మోస్ట్ లీడర్లు చాలా మందే ఉన్నారు. ఐదారుసార్లు మంత్రులుగా పనిచేసిన వారు..ఆరేడు సార్లు గెలిచిన వాళ్లు..సామాజిక వర్గాల వారీగా, ప్రాంతాల వారీగా సైకిల్ పార్టీకి బలమైన అనుభవమున్న నేతలు ఉన్నారు.అయితే గత ఎన్నికలకు ముందు పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని.. రాబోయే 40ఏళ్లు పార్టీ స్ట్రాంగ్‌గా నిలబడేలా నాయకత్వాన్ని పటిష్టం చేసుకో వాలనే ఆలోచనతో..చాలామంది జూనియర్లకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు సీఎం చంద్రబాబు. ఫస్ట్ టైమ్ గెలిచిన ఎమ్మెల్యేలను కూడా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇప్పుడున్న క్యాబినెట్‌లో 18మంది కొత్త ముఖాలే. అయితే ఈ మధ్య మంత్రుల పనితీరుపై చాలా సీరియస్‌గా ఉన్నారు చంద్రబాబు. పనితీరు బాలేదని ముఖం మీదే చెప్పయడమే కాదు..మంత్రివర్గం లో మార్పులు, చేర్పులకు రెడీ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రావణమాసం రాగానే..క్యాబినెట్‌లో ఇప్పటికే ఖాళీగా ఉన్న ఓ పోస్ట్‌ను భర్తీ చేయ డంతో పాటు..నలుగురు, ఐదుగుర్ని తొలగించి వారి స్థానంలో కొత్తవాళ్లను తీసుకుంటారన్న ప్రచారం బయలుదేరింది.పనితీరు బాలేని జూనియర్లను క్యాబినెట్ నుంచి తప్పిస్తారన్న ఊహాగానాల తో..సీనియర్లలో ఆశలు చిగురిస్తున్నాయట. ఉత్తరాంధ్ర టు రాయలసీమ వరకు టీడీపీలో చాలా మంది సీనియర్లు మంత్రి పదవి మీద ఆశలు పెట్టుకున్నారట. అయితే 2024లో బెర్త్ దొరకక కాస్త మౌనంగానే ఉంటూ వస్తున్నారు. జిల్లాలను శాసించే సీనియర్ లీడర్లు కాస్త..సొంత నియోజకవర్గాలకే పరిమితం అవుతూ వస్తున్నా రు. అంతేకాదు వైసీపీపై విమర్శల విషయంలో కూడా మంత్రులదే బాధ్యత అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారట. అయితే సీనియర్ల లీడర్లతో అధినాయకత్వం బాగానే ఉంటోంది. మంత్రివర్గంలోకి తీసుకోకపోయి నా.. పెద్ద పెద్ద పోస్టులు ఇవ్వకపోయినా..పార్టీ కోసమే కొత్త నీరు అన్నట్లుగానే చెబుతూ వస్తోంది. ప్రభుత్వంలో పెద్దగా అనుభవం కలిగినవారు లేకపోవడంతో ధాటిగా విపక్షాల విమర్శలను తిప్పికొట్టలే కపోతున్నారట. ఇప్పుడున్న మంత్రివర్గంలో ఇద్దరు సీనియర్ లీడర్లు రామానాయుడు, పయ్యావుల కేశవ్ పనితీరు మీద మాత్రమే సీఎం సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి విస్తరణలో మళ్లీ సీనియర్లనే తీసుకుంటారని..తమకు అవకాశం దక్కబోతుందని హోప్స్ పెట్టుకుంటున్నారట సీనియర్ టీడీపీ లీడర్లుసబ్జెక్ట్‌పై పట్టుండేవారు. విపక్షం నుంచి ఒక విమర్శ రాగానే అన్ని లెక్కలతో సహా ఇచ్చిపడేసే వాళ్లు. రాజకీయంగా దూకుడుగా ఉండేవారు అవసరమని భావిస్తున్నా రట.

ఇవన్నీ క్వాలిటీస్ ఉండాలంటే సీనియర్లుగా తమకే అవకాశం ఉంటుందనేది నేతల అంచనాలున్నాయట. ఈ క్రమంలోనే మంత్రివర్గంలో మార్పులు జరిగితే కనుక కచ్చితంగా సీనియర్లకు ధాటిగా మాట్లాడేవారికి కచ్చితంగా చోటు దక్కుతుందని ప్రచారం సాగుతోంది. దాంతో సీనియర్ లీడర్లలో ఫుల్ హుషార్ కనిపిస్తోందట.తమకు అమాత్య కిరీటలు దక్కే రోజు దగ్గరలోనే ఉందని ఊహల్లో తేలియాడు తు న్నారట. మళ్లీ అధికారం చేపట్టాలంటే ప్రయోగాలను పక్కన పెట్టి..వైసీపీని కట్టడి చేసేందుకు సీనియర్లను రంగంలోకి దింపే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అదే జరిగితే కొత్తగా పాత ముఖాలను క్యాబినెట్‌లో చూసే రోజులు దగ్గరలోనే ఉండబోతున్నా య్. అమాత్య పదవి దక్కే సీనియర్ లీడర్లు ఎవరో చూడాలి మరి.

# ప్రశ్నించడం మానేశారా..?

ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. 2014లో నాడు బీజేపీ, టీడీపీ కూటమికి పరోక్షంగా మద్దతిచ్చిన పవన్ కల్యాణ్ 2019 ఎన్నికలకు వచ్చేసరికి విభేదించారు. సొంతంగా పోటీ చేసిచేతులు కాల్చుకున్నారు. నాడు అమరావతి రాజధాని రైతుల నుంచి 32 వేల ఎకరాల మూడు పంటల భూమిని సేకరించడాన్ని పవన్ కల్యాణ్ తప్పుపట్టారు. రాజధానికి అంత భూములు అవసరమా? అని ప్రశ్నించారు.అంతేకాదు నాడు ఒకడుగు ముందుకేసి రాజధాని ప్రాంతంలో పర్యటించి భూములు తీసుకున్న రైతులకు అండగా నిలబడతానని భరోసా కూడా ఇచ్చి వచ్చారు. అయితే 2024 ఎన్నికల నాటికి ఆయన వాయిస్ మారింది. రాజధాని రైతుల విషయంలో ఆయన తన స్టాండ్ ను మార్చుకున్నారు. అసలు నాడు ప్రశ్నించిన దానిని మర్చిపోయారనిపిస్తుంది. రహదారుల కోసం ఇళ్లను కూల్చివేస్తే ఇప్పటంలో హడావిడి చేసిన పవన్ కల్యాణ్ ఇప్పుడు మౌనంగా ఉండటమేంటని పలువురు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం రాజధాని అమరావతి కోసం మరో నలభై వేల ఎకరాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. రాజధాని కోర్ కాపిటల్ బయట నలభై ఎకరాలు సేకరించి భవిష్యత్ అవసరాల కోసం ఉంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది కానీ పవన్ కల్యాణ్ దీనిపై ఎలాంటి కామెంట్స్ చేయకపోవడం ఇప్పుడు చర్చనీయాంశ మైంది. అధికారంలో లేనప్పుడు ఒకలా, ఉన్నప్పుడు మరొకలా వ్యవహరించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే రాజధాని రైతులు తమ సమ్మతితోనే భూములు ఇస్తుండటంతో పవన్ కల్యాణ్ మౌనంగా ఉంటున్నారని జనసేననేతలు చెబుతున్నారు. గతంలో రాజధానిభూముల విషయంపై చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పవన్ కల్యాణ్ నేడు మౌనంగా ఉండటాన్ని ఆయన సర్దుకుపోయే మనస్తత్వానికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రైతులు అంగీకరించినా అంత పెద్ద స్థాయిలో అంటే ఒక్క రాజధాని నిర్మాణం కోస77వేల ఎకరాలను సేకరించడాన్ని ప్రశ్నించకపోతే ప్రజల తరుపున ఏమి చేస్తారం టూ నిలదీస్తున్నారు. కనీసం అభ్యంతరం కూడా చేయకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత పవన్ కల్యాణ్ పూర్తిగా ఛేంజ్ అయినట్లు కనప డుతుంది. మిత్ర ధర్మంతో చంద్రబాబు నాయుడు కు మద్దతు ఇవ్వడంలో తప్పులేదు. అదే సమయంలో ఆయన పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరు కోవడాన్ని కూడా ఎవరూ ఆక్షేపించరు.

# వలంటీర్ల వ్యవస్థ... కామా కాదు... ఫుల్ స్టాప్...



**గుంటూరు,తెలంగాణ దిశ :**ఏపీలో కూటమి సర్కార్ వచ్చిన తర్వాత వాలంటీర్ల వ్యవస్థను సైడ్ చేశారు. వాలంటీర్లు సేవలను వాడకుండానే పెన్షన్లను ఇచ్చేస్తున్నారు. రేషన్ బండ్లతో పనిలేకుండానే సరుకుల్ని పంచేస్తున్నా రు. ఏపీలో ఇక వాలంటీర్ల అవసరం లేకుండా పోయింది. వాలం టీర్ల వ్యవస్థ వల్లే వైసీపీకి నష్టం జరిగిందని అన్ని సర్వేలు చెబుతు న్నాయి. ఇటు వైసీపీ సైతం అదే నిజమని భావిస్తోంది. అందుకే కూటమి సర్కార్ కూడా వాలంటీర్ల వ్యవస్థను టచ్ చేయడం లేదట. వాలంటీర్ల వ్యవస్థ విషయంలో వైసీపీ కూడా ఓ క్లారిటీకి వచ్చేసినట్టు ఆ పార్టీ నేతలు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. మాజీ సీఎం జగన్ ఇక నుంచి వాలంటీర్ల వ్యవస్థ జోలికి వెళ్లకూడదని నిర్ణయాని కి వచ్చినట్లు సమాచారం. తాజాగా దీనిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే పార్టీ అంతర్గత మీటింగ్‌లో మాట్లాడారని తెలుస్తోంది. వాలంటీర్ల వ్యవస్థ పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకొచ్చారాయన. వాలంటీర్ల వ్యవస్థ అనేది ముగిసిన అధ్యాయం కానుంది. కూటమి ప్రభుత్వమే కాదు భవిష్యత్‌లో వైసీపీ కూడా వాలంటీర్ వ్యవస్థ జోలికి పోయేలా కనిపించడం లేదు. ఆ వ్యవస్థతోనే వైసీపీకి దారుణ పరాజయం ఎదురైందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారట.నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల పార్టీ శ్రేణులతో కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ వ్యవస్థ వల్ల వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరమయ్యారని అన్నారు. తాను పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి దగ్గర ఇదే విషయాన్ని ప్రస్తావించానని చెప్పుకొచ్చారు. ఏ పార్టీకైనా కార్యకర్తలే మూలస్తంభాలని, వాలంటీర్లు కాదని హైకమాండ్‌కు చెప్పారట.వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరోసారి వలంటీర్ వ్యవస్థ జోలికి వెళ్ళవద్దని విజ్ఞప్తి చేసినట్లు స్వయంగా పార్టీ సమావేశంలోనే చెప్పారట. అయితే మాజీ ఎమ్మెల్యే అభిప్రాయాన్ని ఆ పార్టీ శ్రేణులందరూ ముక్తకంఠంతో ఆహ్వానించారట. రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఇదే అభిప్రాయంతో ఉన్నారని పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్.2019లో అధికారంలోకివచ్చిన వెంటనే వలంటీర్ వ్యవస్థను ప్రారంభించింది వైసీపీ ప్రభుత్వం. ప్రతి 50 కుటుంబాల బాధ్యతను వారికి అప్పగించింది. దీంతో వైసీపీ నాయకత్వానికి, పార్టీ శ్రేణులకు పని లేకుండా పోయింది.ప్రభుత్వం అంటే వలంటీర్ వ్యవస్థ అనే భావన ప్రజల్లో పాతుకుపోయింది. ప్రతి చిన్న అవసరానికి జనం వాలంటీర్ల చుట్టూ తిరిగారు. వైసీపీ క్యాడర్, స్థానిక నేతలకు ప్రజలతో గ్యాప్ ఏర్పడింది. అప్పట్లో వాలంటీర్ వ్యవస్థపై వైసీపీ ప్రజా ప్రతినిధులే పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. కానీ మాజీ సీఎం జగన్ లెక్క చేయలేదు. సరిగ్గా ఎన్నికల ముందు వాలంటీర్ వ్యవస్థను నిలిపివేసింది ఎన్నికల కమిషన్. దీంతో చాలామంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. అయితే కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని.. రాజీనామాలు చేయవద్దని విజ్ఞప్తితో.. సగం మంది రాజీనామాలు చేయలేదు.అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదన్నర అవుతోంది. కానీ వాలంటీర్ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం పెద్దగా మాట్లాడడం లేదు. వాలంటీర్ వ్యవస్థ మూలంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగిందన్నది మెజారిటీ పార్టీ శ్రేణుల అభిప్రాయపడుతున్నారు.ఒకవేళ ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థను సమర్థిస్తే.. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో అందుకే ఈ వ్యవస్థ విషయంలో కూటమి బాటలోనే నడవాలని వైసీపీ నిర్ణయించుకుందని పొలిటికల్ సర్కిళ్లలో మెయిన్ డిబెట్ పాయింట్‌గా మారింది.ఫైనల్‌గా వాలంటీర్ల వ్యవస్థకు తెరపడినట్లేనన్న టాక్ వినిపిస్తోంది. భవిష్యత్‌లో కార్యకర్తలకే ప్రయారిటీ ఇస్తామని స్వయంగా పార్టీ అధినేత జగన్ అంటున్నారు. అంటే వాలంటీర్లు ఉండరని చెప్పకనే చెప్తున్నారు జగన్. అలా అధికార, అపోజిషన్ వార్ మధ్య వాలంటీర్ వ్యవస్థ కనుమరుగై నట్లేనన్న ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి.

# బకాయిలు కొండంత! ఇచ్చేది గోరంత!!



మన రాష్ట్రంలో ఉన్నత విద్య చదువుతున్న వేలాదిమంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ అనేది జీవనాధారం. గత మూడేళ్లుగా స్కాలర్షిప్‌లు అరకొరగా విడుదల చేయడంతో 14 లక్షల మంది విద్యార్థులలో అధిక భాగం విద్యార్థులు బతుకులు చిద్రమయ్యాయి. వారిపై తీవ్రమైన ఆర్థిక , మానసిక ఒత్తిడి పెరిగిపోతోంది. ఫీజు రీయింబర్స్మెంట్ అనేది భిక్ష కాదు , ఎంతోమంది విద్యార్థులు పోరాడి సాధించుకున్న హక్కు. ప్రభుత్వ అధికార లెక్కల ప్రకారం 2023 నుండి ఇప్పటి వరకు దాదాపుగా 6,800 కోట్ల రూపాయల స్కాలర్షిప్ పెండింగ్ ఉంది. ఈ విష యంలో కూటమి ప్రభుత్వం మరియు గత వైసిపి ప్రభుత్వం ఇద్దరిదీ తప్పు ఉంది. అధికారం నుంచి దిగిపోతున్నాం మాకేంటి అనే ఆలోచనలో వైసీపీ ప్రభుత్వం 3.8 వేల కోట్ల రూపాయలు పెండింగ్ పెడితే,తన యువగళం పాదయాత్రలో విద్యా రంగాన్ని గాడిన పెడతా అని చెప్పిన నారా లోకేష్ గారు నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టు సంవత్సరం ఆరు నెలల కాలంలో పాత బకాయిలు ఇవ్వకపోగా 3 వేల కోట్ల రూపాయల పెండింగ్ పెట్టారు.

విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు: డిగ్రీ , ఇంజనీరింగ్ విద్యార్థులకు సాధారణంగా మన రాష్ట్రంలో ఫీజులు లక్షల్లోనే ఉంటున్నాయి. ప్రధానంగా నూతన జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చాక ఎయిడెడ్, ప్రభుత్వ విద్యా సంస్థలు మూతపడి పెద్ద ఎత్తున కళాశాలలు అన్ని కార్పొరేట్ హస్తాల్లోకి వెళ్లిపోయాయి. కాబట్టి ఈ లక్షల రూపాయల ఫీజు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అవి చెల్లించలేక అప్పులు చేస్తున్నారు. కొన్ని సార్లు ఈ అప్పులు ప్రైవేటు ఫైనాన్స్ వారి వద్ద మరియు లోన్ ఆప్స్ లో తీసుకోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక వైపు హాస్టల్ ఫీజులుతో పాటు మెస్ బిల్లులు , కళాశాలకు ప్రయాణపు ఖర్చులు , పుస్తకాలు , ఎగ్జామ్ ఫీజులు మారుతున్న సమాజంలో పెరిగిన ధరలతో ఆ ఖర్చులన్నీ వారి కుటుం బానికి మోయలేని భారాన్ని ఇస్తున్నది. అనేక మంది ఆ భారాన్ని భరించలేక చదువు మధ్యలోనే ఆపేసే పరిస్థితి. మా ఊరిలో ప్రతీ ఏడాది ఇంటర్మీడియట్ 50 మంది చదివితే ఉన్నత విద్యకు వచ్చేసరికి 10 మంది కూడా ఉండడం లేదు. దీనికి కారణం చదువుకోలేక కాదు చదువు కొనలేక! కళాశాలల్లో ఫీజులు చెల్లించలేకపోవడంతో ఆ కళాశాలలు పరీక్ష హాల్ టికెట్స్ ఆపేసి విద్యార్థులను రోడ్డు మీద పడేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మీడియా ముందుకు వచ్చి ఎవరూ విద్యార్థులను ఇబ్బంది పెట్టకూడదు అని చెప్తుంది. కానీ ఆ ప్రభుత్వం లోనే భాగస్వాములుగా ఉన్న అశోక గజపతిరాజు గారి మహారాజా కళాశాలలోనే విద్యార్థులపై ఫీజుల కోసం దారుణమైన వేధింపులు జరుగుతున్నాయి. ఇంత కష్టపడి ఉన్నత విద్య పూర్తయిన తరువాత పూర్తి స్థాయి స్కాలర్షిప్ విడుదల కాకపోవడంతో సర్టిఫికెట్స్ ఇవ్వని పరిస్థితి. ఆ సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడంతో ఉద్యోగాల విషయంలో అనేక ఇబ్బందులు గురవుతున్నారు.

విద్యార్థుల పోరాటాలు: ఎప్పుడూ లేనంతగా నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యార్థుల నుండి తీవ్ర ఆందోళన చవి చూసింది. ఉన్నత విద్య చదివే వారిలో 72.9% మంది వెనకబడిన తరగతులకు చెందిన వారే. ఆర్థికంగా బలం లేకపోవడంతో వారు పడుతున్న కష్టాలలో నుండి తిరుగుబాటు ప్రారంభం అవుతుంది. గతం ప్రభుత్వ పతనం లో విద్యార్థుల పోరాటాలది ముఖ్యమైన పాత్ర అనేది ఎవరు కాదనలేని సత్యం. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్షిప్స్ కోసం అనేక సార్లు విద్యార్థులు కలెక్టరేట్ ను ముట్టడించి, తమ గళం విప్పారు. ప్రతీ జిల్లాలో వేలాది మంది ఈ పోరాటాల్లో పాల్గొంటున్నారు. ఈ 16 నెలల కాలంలో విజయనగరం జిల్లాలో ఏడుసార్లు విద్యార్థుల ప్రత్యక్ష ఆందోళనకు దిగడం చూస్తుంటే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అర్థమవుతున్నాయి. ఒక విజయనగరం జిల్లానే కాక విశాఖపట్నం, పార్వతీపురం, ఉభయగోదావరి జిల్లాలు , కర్నూలు ,అనంతపురం ,తిరుపతి ఇలా రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ కోసం పోరాటం కొనసాగిస్తున్నారు. సాక్షాత్తు రాష్ట్ర మంత్రులైన గుమ్మడి సంధ్యారాణి గారు కొండపల్లి శ్రీనివాస్ గార్లను విజయనగరం జడ్పీ హాల్‌లో వేల సంఖ్యలో విద్యార్థులు నిర్బంధించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. జిల్లాలో ఉన్న ఏడుగురు ఎమ్మెల్యేలను, కలెక్టర్ ,ఎంపీలను కూడా ఆ నిర్బంధంలో చిక్కుకున్నారు. ఆందోళన నుంచి తప్పించుకోవడానికి మంత్రివర్గంలో మాట్లాడతామని చెప్పిన ఇద్దరు మంత్రులు మంత్రివర్గ సమావేశంలో పన్నెత్తుమాట కూడా మాట్లాడకపోవడం విడ్డూరం. మన రాష్ట్రంలో ఫీ రీయింబర్స్మెంట్ పథకం పథకం 2002-03 లో చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు మొదలైంది. దీనికి ప్రధాన కారణం ఆనాడు ఎస్ఎఫ్ఐతో పాటు పలు విద్యార్థి సంఘాలు చేసిన పోరాటమే. ఇది మొదట ఎస్సి. ఎస్టి, బిసి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2007లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పథకాన్ని విస్తరించి, అన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు 100% రీయింబర్స్మెంట్ కల్పించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు వారి కాలేజీ ఫీజులు, పరీక్ష ఫీజులు మొదలైన ఖర్చులను ప్రభుత్వం ద్వారానే భరించటం ద్వారా ఉన్నత విద్యలో విద్యార్థులకు చేయూత అందించడం. ఫీజు భారం వల్ల విద్యార్థులు విద్యను మధ్యలోనే నిలిపివేయకుండా చూడటం, సమానంగా విద్య అవకాశాలు పొందేలా చేయడం ఈ పథకం లక్ష్యం. కానీ ఆ లక్ష్యం ఇప్పటివరకు ఏ ప్రభుత్వ హయాంలోనూ నెరవేరలేదు. ఎందుకంటే అప్పటి నుండి ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వాలన్నీ ఎంత సేపు ప్రచారం చేసుకోవడం తప్ప పూర్తిస్థాయిలో అవసరమైన నిధులను విడుదల చేయలేదు. ప్రభుత్వం మారితే పథకం పేరు మార్చడమే తప్ప పేద , బడుగు , బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలనే ఆలోచన లేదు. దీన్ని ఈ మధ్య కాలంలో విద్యార్థులు గమనించి రోడ్డు ఎక్కుతున్నారు. 14 లక్షల మందికి న్యాయం చేయడం కోసం పెట్టిన ఈ పథకం కనీసం 14 వేల మందికి కూడా ఉపయోగపడలేదు. ఒక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి దాదాపుగా 90 వేల రూపాయల వరకు స్కాలర్షిప్ పొందే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఆ స్కాలర్షిప్ విడుదల చేయకపోవడంతో నాలుగు సంవత్సరాలకు గాను దాదాపుగా మూడున్నర లక్షల రూపాయలు కళాశాలకు బాకీ పడుతున్నాడు. ఆ బాకీ చెల్లించలేక సర్టిఫికెట్లు పొందే అవకాశాన్ని కోల్పోతున్నారు.

విద్యార్థులు ఏం కోరుతున్నారు?: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు అకడెమిక్ క్యాలెండర్‌తో లింక్ ఉన్న టైమ్‌బౌండ్ షెడ్యూల్‌ను చట్టబద్ధం చేయాలి. జ్ఞానభూమి వంటి పోర్టల్స్‌లో ప్రతి విద్యార్థికి తన అప్లికేషన్, బిల్లు ప్రాసెసింగ్, రిలీజ్ స్టేజీల వివరాలు పారదర్శకంగా, రియల్ టైమ్‌లో కనిపించేలా సిస్టమ్ బలోపేతం చెయ్యాలి. ఆలస్యాన్ని కారణం చూపి కాలేజీలు విద్యార్థులను అవమానించడం, పరీక్షలకు అనుమతించకపోవడం, సర్టిఫికెట్లను ఆపివేయడం వంటి చర్యలను నిరోధించడానికి కఠినమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలి. గ్రామీణ, గిరిజన, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల పెండింగ్ బకాయిలన్నీ నిర్దిష్ట గడువులో పూర్తిగా విడుదల చేయాలని, భవిష్యత్తులో ఈ పరిస్థితి రాకుండా చూసేందుకు ప్రత్యేక మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటుచేయాలని విద్యార్థులు కోరుతున్నారు. అత్యంత న్యాయమైన ఈ డిమాండ్లు కూడా పరిష్కారానికి దూరంగా ఉన్నాయి,.

గత 16 నెలలుగా సాక్షాత్తు ముఖ్యమంత్రి కుమారుడు విద్యాశాఖ మంత్రిగాఉన్నా సరే వీటిలో ఒక్క డిమాండ్ కూడా పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయింది. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో విద్యావ్యవస్థ పునాదిగా ఉంటుంది. మరి అటువంటి విద్యావ్యవస్థకి మన రాష్ట్రం బడ్జెట్లో 30% నిధులు కేటాయించాల్సి వస్తే కేవలం 12% నిధులు విదిలిచండం చూస్తే వారికి విద్యా వ్యవస్థ పై ఉన్న శ్రద్ధ ఏంటో అర్థమవుతుంది. పోనీ కేటాయించిన ఆ నిధులైన ఖర్చు చేస్తున్నారా అంటే అవసరానికి తగ్గట్టు వేరే శాఖలకు ఆ నిధులను మళ్లిస్తున్నారు. చదువు హక్కు! దయ కాదు. చదువుకునే విద్యార్థికి స్కాలర్‌షిప్ ఇవ్వడం అంటే రాజ్యాంగం హామీ ఇచ్చిన విద్యా హక్కును ఆచరణలో పెట్టడానికి తీసుకున్న బాధ్యత. ఆ బాధ్యతను నిర్లక్ష్యంతో నిర్వర్తించడం అంటే పేద, మధ్యతరగతి, అణగారిన వర్గాల భవిష్యత్తుతో రాజీ పడటమే. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న స్కాలర్‌షిప్‌ల సమస్యను తక్షణమే పరిష్కరించాలి. ఇకనుంచి ఒక్క విద్యార్థి కూడా "డబ్బుల్లేవని" చదువు మానేయాల్సిన దుస్థితి రాకూడదు. దీనికి బాధ్యత వహించాల్సింది విద్యా శాఖ మంత్రే! విద్యార్థులు అడుగుతుంటే అది విడుదల చేయకపోగా, 16 నెలల కాలంలో 3.8 వేల కోట్ల రూపాయలకు కేవలం 800 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేయడం దుర్మార్గం కాక మరేమవుతుంది. రాజ్యాంగ హక్కును నెరవేర్చే విధంగా విద్య అందరికీ అందే విధంగా పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.

# తీరనున్న అమరావతి రైతుల చిరకాల వాంఛ



**విజయవాడ,తెలంగాణ దిశ :** అమరావతి రైతుల చిరకాల వాంఛ తీరనుంది. ఏపీ ప్రజల్లో ఉన్న అయోమయం తొలగనుంది. ఏపీకి అమరావతి శాశ్వత రాజధానిగా కేంద్రం గుర్తించనుంది. ఈ మేరకు డిసెంబర్ లో పార్లమెంటులో అమరావతి రాజధానిగా చట్టం చేయనున్నారు. చట్టబద్ధత కల్పించనున్నారు. గత అనుభవాల దృష్ట్యా భవిష్యత్తులో మరోసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చట్టబద్ధత కల్పించాలన్నది చాలా ఏళ్లుగా వినిపిస్తూ వస్తోంది. ఇప్పుడు ఏపీలో టిడిపి కూటమి ప్రభుత్వం ఉండడం.. ఆపై కేంద్రంలో కీలక భాగస్వామి కావడంతో అమరావతికి చట్టబద్ధత అనేది సులువు అవుతోంది. దేశంలో ఏ రాష్ట్ర రాజధానికీ లేని అరుదైన గౌరవం, ఆపై ఏకంగా చట్ట 'భద్రత' దొరకనుంది.నవ్యాంధ్రప్రదేశ్ కు టిడిపి తొలి ప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది. అయితే అటు తరువాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కారణాలతో మూడు రాజధానుల అంశా న్ని తెరపైకి తెచ్చింది. ఆ సమయంలో మంత్రి బొత్స లాంటి సీని యర్ నేత కూడా అమరావతికి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదని.. అందుకే అమరావతిని మారుస్తున్నట్లు ప్రకటన చేశారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం సైతం ఈ విషయంలో కలుగజేసుకోలేదు. రాష్ట్రాల రాజధానుల ఏర్పాటు అనేది ఆయారాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని.. అందులో కలుగజేసుకోలేమని ప్రకటించింది. టిడిపి తో బిజెపికి ఉన్న విభేదాలతోనే అలా ప్రకటన చేసిందని అంతా భావించారు. అయితే చాలా సందర్భాల్లో అమరావతిని రాజధానిగా కేంద్రం గుర్తించిందన్న ప్రకటన వచ్చేది అప్పట్లో. అంతకుమించి స్పాంతన ఉండేది కాదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి రాజధాని నిర్మాణ పనులు పున ప్రారంభం అయ్యాయి. కానీ అమరావతి పై అనుమానపు ఛాయలు అలానే ఉండిపోయాయి. జగన్ లాంటి మరో నేత వచ్చి అమరావతి కాదని వేరే రాజధాని ప్రకటిస్తారన్న అనుమానాలు కూడా ఉండిపోయాయి ప్రజల్లో. అందుకే ప్రజల్లో ఉన్న అయోమయాన్ని పోగొట్టాలని సిఆర్డిఏ అధికారులు కేంద్రాన్ని ఆశ్రయించారు. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని.. పార్లమెంటులో చర్చించి ఆమోదించాలని అటార్నీ జనరల్ వెంకటరమణను కోరారు.

అయితే దేశంలో ఏ రాజధానికి కూడా గెజిట్ నోటిఫికేషన్ అనేది ఇవ్వలేదని.. అలా ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం లేదని.. అది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంపై ఆధారపడి ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. అమరావతి విషయంలో చట్టబద్ధత కల్పించకపోతే వచ్చే ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లింది. ప్రజల్లో ఉన్న అయోమయం తొలగించడంతో పాటు భారీగా పెట్టుబడులు వస్తున్న దృష్ట్యా ఇన్వెస్టర్స్‌లో నమ్మకం కోసమైనా అమరావతికి చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందని ఏపీ నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై అటార్నీ జనరల్ సైతం సంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక నోటు తయారు చేసి.. శాఖకు వెళ్ళింది ఆ నోటు. అక్కడ కూడాఅనేక రకాల అభ్యంతరాలు అధిగమించి ప్రస్తుతం హోంశా ఖపరిధిలో ఉంది. డిసెంబర్ లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అమరావతి బిల్లు చర్చకు రానుంది. తప్పనిసరిగా చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. నిజంగా ఇది అమరావతికి శుభపరిణామమే.

# గ్రేటర్ అమరావతికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

**విజయవాడ,తెలంగాణ దిశ :**అమరావతివిషయంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా గత అనుభవాల దృష్ట్యా అమరావతికి చట్టబద్ధత కల్పించాలన్నది ప్రధాన డిమాండ్. అయితే ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలో పార్లమెంట్ ముంగిటకు అమరావతి బిల్లు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సైతం కోరినట్లు సమాచారం. తాజాగా సిఆర్డిఏ అధికారులకు అమరావతి రైతులు కోరింది ఇదే. ఒకసారి చట్టబద్ధత కల్పిస్తే అమరావతి రాజధానిని కదిలించలేరన్నది రైతుల వాదన. దానిని గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది రాష్ట్ర ప్రభుత్వం. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వచ్చే నెలలో అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ముంగిటకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. అమరా వతిలో నవ నగరాలు నిర్మించా లన్నది చంద్రబాబు ప్రణాళిక. ప్రస్తుతం అమరావతిలో 29 పంచాయి తీలే ఉన్నాయి. అయితే ఇటు విజయవాడ, అటు గుంటూరును కలుపుకొని అమరా వతిని ఏకైక నగరంగా గుర్తిస్తే.. గ్రేటర్ హైదరాబాద్ గా మారుతు oది అన్నది చంద్రబాబు ఆలోచన. మొన్న ఈమధ్యన అదే ప్రకటన చేశారుచంద్రబాబు. 29 పంచాయతీలను అమరా వతిగా గుర్తిం చడం అనేది భావ్యం కాదని.. అమరావతి అనేది ఒక సువిశాల నగరంగా ప్రపంచానికి పరిచయం చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే ఇప్పుడు చట్టబద్ధత కల్పించేవిషయంలో ఎలాముందడుగు వేయాలిఅన్నది బాబు ముందున్న అంశం. అయితే వచ్చే ఏడాది వరకు నగరపాలక సంస్థలతో పాటు మున్సిపాలి టీలకు పదవీకాలం గడువు ఉంది.




అయితే అంతకంటే ముందే ఈ నగరాలను, పట్టణాలను, పంచాయితీలను అమరావతి కిందకు తెచ్చేందుకు చంద్రబాబు సర్కార్ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.గ్రేటర్ హైదరాబాద్ తరహాలో.. గ్రేటర్ అమరావతిని తెస్తే బాగుంటుందన్న అభిప్రాయం అధికార వర్గాల్లో ఉంది. ఎందుకంటే అటు విజయవాడ, ఇటు గుంటూరు మధ్య అమరావతిని అభివృద్ధి చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అమరావతికి ఆ రెండు నగరాలు తోడైతే ప్రపంచంలోనే ఏకైక నగరంగా నిలపవచ్చు అన్నది కూడా ఆయన ఆలోచన.

అందుకే ఈ మూడు నగరాలను కలిపి ఏకైక నగరంగా అమ రావతికి చట్టబద్ధత కల్పిస్తే ఎంతో బాగుంటుం దని అధికారులు సైతం కీలక సూచనలు చేశారట. అయితే ఇప్పటికే కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కోరిందట. మొత్తానికి అయితే అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు అవసరమైన అడుగులు పడుతుండడం నిజంగా శుభ పరిణామం.

# హెచ్ ఎండీఏ లేఔట్లకు 100 కోట్లు దాటేసింది

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**అప్పట్లో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నియో పోలిస్‌ప్రాంతంలో హెచ్ఎండిఏ అభివృద్ధి చేసిన లే అవుట్లను వేలం వేస్తే ఎకరం 100 కోట్లు పలికింది. అప్పట్లో దానిని తమ ప్రభుత్వం గొప్పతనానికి నిదర్శనమని గులాబీ పార్టీ పేర్కొంది. తన కరపత్రిక నమస్తే తెలంగాణలో బీభత్సంగా రాసుకుంది.. అంతేకాదు అ ధికారం పైన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపో యిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా అనే వ్యవస్థ వల్ల సర్వం నాశనం అయిందని శోకాలు పెట్టింది. కానీ ఇప్పుడు గులాబీ పార్టీ అధికారంలో ఉన్న దాని కంటే ఇంకా ఎక్కువకే భూములు అమ్ముడుపో తున్నాయి. కోకాపేట ప్రాంతంలో హెచ్ఎండిఏ అభివృద్ధి చేసిన భూములను వేలం వేస్తే ఎకరం ధర 137 కోట్లు పలికింది.కోకాపేట ప్రాంతంలో ఎకరం 137 కోట్లు పలకడం హై ఎండ్ ప్రైస్ అని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఊహించిన విధంగా భూములకు డిమాండ్ ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వారు అంటున్నారు. కోకాపేట ఒకప్పుడు బయటి ప్రాంతంగా ఉండేది.. అయితే బాహ్యవలయ రహదారి వల్ల ఒక్కసారిగా ఈ ప్రాంతానికి డిమాండ్ పెరిగింది.. అనేక కమర్షియల్ ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి వచ్చాయి.. అందువల్లే ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. అందువల్లే బిడ్డర్లు పోటీపడి భూములను సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.. అందువల్లే ఈ స్థాయిలో ధరలు పెరుగుతున్నాయి హైటెక్ సిటీకి దగ్గరగా ఉండటం వల్ల రాయదుర్గం అనే ప్రాంతం లో భూములను వేలం వేస్తే ఎకరం ధర 117 కోట్ల పలికింది.. కోకాపేట ప్రాంతంలో ఆ స్థాయిలో ధర పలకకపోయినప్పటికీ ప్రధాన ఐటీ హబ్ ను దాటి విస్తరించడం వల్ల కోకాపేట ప్రాంతంలో భూముల కు విపరీతమైన ధర ఉంది.భవిష్యత్ కాలంలో మౌలిక సదుపాయాలు, ప్రణాళిక బద్ధమైన టెక్ జోన్లు, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు కారణంగా పెట్టుబడిదారులు కోకాపేట వైపు దృష్టి సారిస్తున్నారు. హైదరాబాద్ నగరం విస్తరిస్తున్నా కొద్దీ కోకాపేట పరిసర ప్రాంతాలు ప్రీమియం పెట్టుబడి హాట్‌స్పాట్ లుగామారతాయని రియల్ ఎస్టేట్‌రంగ నిపుణు లు పేర్కొంటున్నారు.. "భవిష్యత్తు కాలం మొత్తం ఈ ప్రాంతం కేంద్రంగా కార్యకలాపాలు సాగుతా యి.. పెట్టుబడి వ్యూహాలు కూడా ఈ ప్రాంతం ఆధారంగానే సాగుతాయి. అందువల్లే ఇక్కడ భూములకు విపరీతమైనడిమాండ్‌ఉందని" రియల్‌ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు.

# రేషన్‌లో రాగులు!



శ్రీకాకుళం,తెలంగాణ దిశ : డిసెంబరు నెల రేషన్‌లో రాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ అందించనుంది. బియ్యం బదులు కేజీ రాగులు ఇవ్వాలని భావిస్తోంది. ఈ ఏడాది ఆగస్టులో రాగులు అందించిన ప్రభుత్వం సేకరణ జరగకపోవడం తో మూడు నెలల పాటు ఆపేసింది. మళ్లీ దానిని పునరుద్ధరించా లని నిర్ణయించింది. కార్డుదారులకు కేజీ నుంచి మూడు కేజీల వరకుఉచితంగా రాగులు ఇవ్వనుంది. ఆమేరకు బియ్యంలో కోత విధించనుంది. రాగులతో పాటు బియ్యం,పంచదార అందిం చనుంది. కందిపప్పు ఈ నెలా ఇవ్వడం లేదు.ఏయే డిపోలకు ఎంత మేరకు రాగులు అవసరమో డీలర్ల నుంచి అధికారులు ఇండెంట్‌లు తీసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 29,796 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం ఒక కోటి 48 లక్షల 3 వేల 221 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 4 కోట్ల 34 లక్షల 81 వేల 193 మంది సభ్యులుగా ఉన్నారు. కార్డుదారులకు రాగులు అందించేందుకు 43,142 మెట్రిక్ టన్నుల మేర రాగులు అవసరమని గుర్తించింది. అందులో ఇప్పటివరకు 42,374 టన్నుల వరకు విడుదల చేసింది. ఏయే డిపోలకు ఎంత మేర రాగులు కావాలో డీలర్ల నుంచి ఇండెంట్ తీసుకుంటున్నారు. అందుకనుగుణంగా డిపోలకు కావాల్సినంత పరిమాణంలో రాగులను ఇవ్వాలని అధికార యం త్రాంగం నిర్ణయించింది. ఒక్కో కార్డుదారునికీ కేజీ నుంచి మూడు కేజీల వరకు ఉచితంగా రాగులు అందించనుంది. ఆ మేరకు బియ్యంలో కోత పెట్టనుంది.ఈ నెలా కందిపప్పు లేనట్టే: రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు ఎప్పుడు ఇస్తారో, ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 డిసెంబరులో 50 శాతం కుటుంబాలకు, 2025 జనవరిలో కార్డు దారులందరికీ పంపిణీ చేశారు. తర్వాత అక్కడ నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వడమే మానేశారు. రేషన్‌లో కందిపప్పు కోసం పది నెలలుగా లబ్ధిదారులు ఎదురుచూస్తునే ఉన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా కందిపప్పు పంపిణీ నిలిచి పోవడంతో కార్డుదారులు బయట మార్కెట్లో అధిక ధరకు కొనుగో లుచేయాల్సివస్తోంది.బహిరంగ మార్కెట్‌లో కేజికందిపప్పు రూ. 135 ఉంది. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై కేజీ రూ.67లకే కందిపప్పు అందించేది. ఇది కార్డుదారులకు అధిక ధర నుంచి ఉపశమనం కలిగించేది. ప్రభుత్వం ఆపేసిన తర్వాత బహిరంగ మార్కెట్లో ధరలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు స్థానికంగా ఉన్న రైతు బజార్ల ద్వారా గతంలో కందిపప్పు అందించే వారు. ఇప్పుడు అదీ లేకపోవడంతో బయట మార్కెట్‌లో కందిపప్పు ను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

# సినిమా..

## 70 ఏళ్ల వయసులోను 40 ఏళ్ల కుర్రాడిలా..



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన ఎనర్జీతో, స్టైలిష్ లుక్స్‌తో అభిమానులను అబ్బురపరిచారు. ఇటీవల రవి స్టూడియోస్ వారి ఆధ్వర్యంలో ఆయన ఇంట్లో నిర్వహించిన ఫోటోషూట్ లో చిరంజీవి మార్చిన ఐదు నుంచి ఆరు కాస్ట్యూమ్స్‌కి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. 70 ఏళ్ల వయసులోనూ చిరు ఇంత యంగ్ లుక్ లో కనిపించడం చూసినెటిజన్లు ఆశ్చర్యంతో.. 70 ఏళ్లవయసులోను 40 ఏళ్ల కుర్రాడిలా అదరగొట్టేస్తున్నారు అని కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పర్యావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటివి మన ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్న ఈ రోజుల్లో చిరంజీవిలాంటి హీరోలు చూపిస్తున్న ఫిట్‌నెస్ నిజంగా స్ఫూర్తిదాయకం. ఇది దేవుని వరమో లేకుంటే, ఫిట్‌నెస్ పట్ల పట్టుదల ఫలితమో కాని, ఆయనలోని స్టైల్, గ్రేస్ మాత్రం అసలే తగ్గడం లేదు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలోని "మీసాల పిల్ల" పాట ప్రోమోలో చిరంజీవి స్టైలింగ్ పై కొంత మంది విమర్శలు చేశారు. అయితే తాజా ఫోటోషూట్ ద్వారా చిరు అటువంటి కామెంట్లకు స్టైలిష్‌గా సమాధానం ఇచ్చినట్లే భావిస్తున్నారు అభిమానులు. ఇక ఈ ఫోటోలు చూస్తే చాలు, ఏం హ్యాండ్సమ్, ఏం ఛరీష్మా అన్న ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'భోళా శంకర్' సినిమా తర్వాత చిరంజీవి కొంత గ్యాప్ తీసుకున్నారు. కానీ2025లో ఆయన బిజీ బిజీగా ఉన్నారు.


జనవరిలో 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లకు రాబోతుండగా, ఈ సినిమాపై భారీఅంచనాలు నెలకొన్నాయి. వేసవిలో 'విశ్వంభర' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డైరెక్టర్ బాబీతో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ మూవీ కూడా జనవరిలో సెట్స్ పైకి వెళ్లనుంది. అంతేకాదు, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తో ఓ వయలెంట్ డ్రామా చేయనుండగా, ఇందులో చిరంజీవి సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారు. ఇవి కాకుండా మరో రెండు, మూడు ప్రాజెక్టులు చర్చలదశలో ఉన్నట్లు తెలుస్తోంది. 70 ఏళ్ల వయసులోనూ చిరంజీవి చూపిస్తున్న స్టైల్, డెడికేషన్ యువతకు ప్రేరణగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.. "వయసు ఓ సంఖ్య మాత్రమే" అనే మాటకు చిరంజీవి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచారు.

## ఆషికాను ఆపడం కష్టమే..!



వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి క థానాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థియేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతంఆమె తెలుగులో 'విశ్వంభర' తమిళంలో 'సర్దార్ 2' కన్నడలో 'గత వై భవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'..'విశ్వంభర' కూడాభారీ అంచనాలు ఉన్నప్రాజెక్టులే. ఈసిని మాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో...!

## అల్లు అర్జున్ కొత్త మూవీ అప్‌డేట్ వచ్చేసింది



అల్లుఅర్జున్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది.పుష్ప 2ది రూల్ వంటి బ్లాక్ బస్టర్‌తర్వాత అల్లు అర్జున్ ఎలాంటి సినిమా చేస్తున్నాడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు మేకర్స్. తమిళ దర్శకుడు అట్లీతో తన నెక్స్ట్ ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు మేకర్స్.

ఈ సినిమాకు సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. అల్లుఅర్జున్ 22వ సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది.మొదట అల్లు అర్జున్ –అట్లీ – నిర్మాత కళానిధి మారన్ కలిసి ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు చూపించిన మేకర్స్.. ప్రీ ప్రోడక్షన్ పనుల కోసం లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను సంప్రదించినట్లు చూపించారు. ఇందులోనే అల్లు అర్జున్‌కు స్క్రీన్ టెస్ట్ చేసిన చేయగా.. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్ చూస్తుంటే.. గ్రాఫిక్స్ ప్రధాన పాత్ర పోషించబోతున్నట్లు తెలుస్తుంది.

## 'దండోరా' షూటింగ్‌లో విలక్షణ నటుడు శివాజీ

నేషనల్ అవార్డ్ గెలుచుకున్న చిత్రం 'కలర్ ఫోటో'..బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న

ఈ చిత్రం తాజాగా సెకండ్ షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. 25రోజుల పాటు కంటిన్యూగా జరగనున్న ఈ షెడ్యూల్‌లో విలక్షణ నటుడు శివాజీ పాల్గొంటున్నారు. నైంటీస్, కోర్ట్ వంటి డిఫరెంట్ కంటెంట్‌తో ప్రేక్షకులను అలరించిన ఈ వెర్సటైల్ యాక్టర్ ఇప్పుడు దండోరా చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు.తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు.

విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, నందు,రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు..ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. వెంకట్ ఆర్.శాఖ మూరి సినిమాటోగ్రఫీ, గ్యారీ బి.హెచ్ ఎడిటింగ్, క్రాంతి ప్రియమ్ ఆర్ట్



డైరెక్టర్, రేఖ బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్, ఎడ్వర్డ్ స్టీవ్‌సన్ పెరెజీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, అనీష్ మరిశెట్టి కో ప్రొడ్యూసర్‌గా బాధ్యతలనునిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను తెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు.

## కయదు లోహర్.. అగ్గిరాజేసే అందం..!



ఒక్క సినిమా హిట్టు పడితే చాలు సినీ పరిశ్రమలో తమ ఫేట్ మారిపోతుంది. అప్పటిదాకా సినిమాలు చేసినా కూడా ఒక్క హిట్ సినిమా వల్ల డజన్ల కొద్దీ ఛాన్స్ లు వస్తుంటాయి. ప్రస్తుతం ఇలాంటి ఫేజ్ లోనే ఉంది డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్. హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి ఇప్పటికే సినిమాలు చేస్తున్నా కూడా అమ్మడు అంతగా పాపులర్ అవ్వలేదు. తెలుగులో ఆల్రెడీ శ్రీవిష్ణుతో అల్లూరి సినిమా చేసింది కయదు లోహర్. ఆ టైంలో అమ్మడిని అసలు ఎవరు పట్టించుకోలేదు. కానీ ప్రదీప్ రంగనాథ్ డ్రాగన్ సినిమా రిలీజైన దగ్గర నుంచి కయదు కనిపిస్తే చాలు హడావిడి చేస్తున్నారు. కయదుకి వచ్చిన ఈ క్రేజ్ ఆమెకు వరుస అవకాశాలు వచ్చేలా చేస్తున్నాయి. డ్రాగన్ సినిమాలో కయదు గ్లామర్ షో కుర్రాళ్లని ఎట్రాక్ట్ చేసింది. కయదు తెలుగులో కూడా మంచి క్రేజ్ సంపాదించింది.

ప్రస్తుతం అమ్మడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తో ఫంకీ సినిమాలో నటిస్తుంది. రవితెజ అనార్కలిలో కూడా ఉందని టాక్. ఐతే ఎలాగు సినిమా ఆఫర్లతో సూపర్ జోష్ లో ఉన్న కయదు అది చాలదు అన్నట్టుగా తన సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా అదరగొట్టేస్తుంది. అమ్మడి ఫోటో షూట్స్ ఇలా షేర్ చేస్తే అలా వైరల్ అవుతున్నాయి. లేటెస్ట్ గా కయదు లోహర్ చంకీల డ్రెస్ లో తళతళ మెరుస్తుంది. ఈ ఫోటో షూట్స్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అగ్గి రాజేస్తున్న అందం.. గుండెల్ని గుచ్చేసే చూపులతో కయదు హృదయాలను మెలిపెట్టేస్తుందని చెప్పొచ్చు. డ్రాగన్ ఒక్క హిట్ తోనే అమ్మడు ఈ రేంజ్ పాపులారిటీ సంపాధించగా ఇక నెక్స్ట్ అమ్మడి ఖాతాలో మరో హిట్ పడితే మాత్రం ఇక తిరుగు లేని క్రేజ్ తెచ్చుకునేలా ఉంది. తెలుగులో మాత్రం కయదుకి మంచి బజ్ ఏర్పడింది. విశ్వక్ సేన్‌తో ఫంకీ సినిమాలో ఆమె స్పెషల్ ఎట్రాక్షన్ అవుతుందని చెప్పొచ్చు. అనుదీప్ డైరెక్షన్ లో వస్తున్న ఫంకీతో కయదు టాలీవుడ్ కి మరోసారి రీ ఎంట్రీ ఇస్తుంది. తనకు వచ్చిన ఈ క్రేజ్ ని ఎంజాయ్ చేస్తున్న కయదు రెగ్యులర్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎంటర్టైన్ చేస్తుంది. కయదు గ్లామర్ షోకి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. చూస్తుంటే అమ్మడు సౌత్ లో టాప్ రేంజ్ కి వెళ్లేలా ఉందని చెప్పొచ్చు.

## ప్రేమ, పెళ్లిపై శ్రీలీల స్పందన

టాలీవుడ్ లో అతి తక్కువ కాలంలో స్టార్ గా ఎదిగిన హీరోయిన్ శ్రీలీల. అద్భుతమైన నటన, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ తో భారీ ఫాలోయింగ్ ను సొంతం చేసుకుంది. వరుస సినిమాలతో దూసుకుపోతోంది. బాలీవుడ్ లోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి అంశాలపై శ్రీలీల ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం తన వయసు 24 సంవత్సరాలు మాత్రమేనని... 30ఏళ్లు వచ్చేంత వరకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదని శ్రీలీల తెలిపింది. ప్రస్తుతం తన ఫోకస్ మొత్తం సినిమాలపైనే ఉందని చెప్పింది. ప్రైవేట్ లైఫ్ గురించి ఆలోచించేందుకు తనకు సమయంలేదని తెలిపింది. తాను నిజంగా రిలేషన్ లో ఉంటే... అమ్మ తమతో ఉండగలదా అని ప్రశ్నించింది. అమెరికా వెళ్లినప్పుడు కూడా అమ్మ తనతోనే ఉంటుం దని తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో తాను ఎవరితో ప్రేమలో పడగల నని ప్రశ్నించారు. ప్రస్తుతం తనకు పెద్ద సినిమాలు వస్తున్నాయని తెలిపింది. ప్రేక్షకుల అభిమానం పొందడమే తన లక్ష్యమని చెప్పింది.






Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215